
అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ | మంగళవారం 10-11- 2026 | సంపుటి : 6 | సంచిక : 263 ఎడిటర్ : ఆనంద్ రావు | పేజీలు : 8 వెల : 3-00

తెలంగాణలో బియ్యం ధరల నియంత్రణకు చర్యలు



- తెలంగాణలో బియ్యం ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు
- కిలో బియ్యం ధర కనిష్ఠం రూ.66.. గరిష్ఠం రూ.79గా నిర్ణయం
- బీపీటీ, కేఎన్‌ఎం రకాల బియ్యం ధర రూ.66గా ఖరారు
- తెలంగాణ సోనా బియ్యం కిలో రూ.74గా నిర్ణయం

2లో

ఏఐ ఆధారిత సైబర్ దాడులపై బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి

- భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక నిఘా పెట్టాలి: సీపీ సజ్జనార్
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సైబర్ భద్రతను బలోపేతం చేసుకోవాలి
- పాత సాఫ్ట్‌వేర్లు, భద్రతా లోపాలనే లక్ష్యంగా చేసుకుంటున్న హ్యాకర్లు
- ఏఐ ఏజెంట్లతో నెట్‌వర్క్ లోపాలను గుర్తిస్తున్న సైబర్ నేరగాళ్లు
- మ్యూల్ ఖాతాల్లోకి కోట్ల రూపాయలు మళ్లిస్తున్న హ్యాకర్లు
- వినియోగంలో లేని పాత ఏపీఐలను తొలగించాలని సూచన



2లో

తెలంగాణకు మళ్లీ కేసీఆర్

నాయకత్వం ఎందుకు కావాలి?



అభ్యుదయం

,,తెలంగాణ అభివృద్ధి, రైతు సంక్షేమం, పేదల భరోసా... కేసీఆర్ పాలనలోఅమలైన పథకాలపై ప్రత్యేక కథనం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించి, ప్రత్యేక రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తన పదేళ్ల పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారు. రైతుల నుంచి పేదల వరకు, మహిళల నుంచి విద్యార్థుల వరకు వివిధ వర్గాలను దృష్టిలో పెట్టుకుని పథకాలు రూపొందించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతుబంధు, రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రైతుబీమా, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఆసరా పెన్షన్లు అమలు చేశారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళిత కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి దళితబంధు, పేదలకు

వివరాలు 2లో

తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలిపేందుకు కష్టపడుతున్నాం

- తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు
- పాలమూరులో గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శ
- ఎన్నో ప్రభుత్వాలు మారినా ప్రజల తలరాతలు మారలేదని వ్యాఖ్య
- నీళ్లు, పరిశ్రమల కోసం పాలమూరు ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు
- గతంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను గెలిపించి గుండెల్లో పెట్టుకున్నాం
- ఎంపీగా గెలిపించి ముఖ్యమంత్రిని చేస్తే జిల్లాకు న్యాయం జరగలేదని విమర్శ

పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తారని ఆశించామని వెల్లడి

జిల్లాకు పరిశ్రమలు, సాగునీరు అందించడంలో గత పాలకులు విఫలమయ్యారని ఆరోపణ

రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నామని సీఎం స్పష్టీకరణ



కొడంగల్, **అభ్యుదయం**

తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలిపేందుకు కష్టపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని చెప్పారు. సోమవారం కొడంగల్‌లో నిర్వహించిన ఆత్మీయ సభలో రైతులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. గతంలో ఎంతోమంది మంత్రులైనా పాలమూరులో నీళ్లు పారలేదు.. వలసలు ఆగలేదని గుర్తు చేశారు.గతంలో ఎంతమంది నేతలు మారినా.. పాలమూరు ప్రజల తలరాతలు మారలేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు వాసులు.. ఎప్పుడూ నీళ్లు, పరిశ్రమల కోసం.. ఎంతోమంది నాయకులను అడిగారని చెప్పారు. కానీ ఈ జిల్లాకు పరిశ్రమలు, నీళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు.బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను గతంలో పాలమూరు నుంచి గెలిపించి గుండెల్లో పెట్టుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇక్కడి నుంచే ఎంపీగా గెలిచిన కేసీఆర్.. ఆ తర్వాత ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రుణం తీర్చుకుంటారని అనుకున్నామని అన్నారు. పాలమూరు ప్రాజెక్టులను ఆయన పూర్తి చేస్తారని ఆశపడ్డామని పేర్కొన్నారు.



రాష్ట్రంలో జరిగిన వేర్వేరు అగ్నిప్రమాదాలపై సీఎం ఆరా

- రాజాం, గన్నవరం, తిరువూరులో అగ్నిప్రమాద ఘటనలు
- రాజాంలో ఆటోమొబైల్ షోరూమ్ దగ్ధం.. భారీగా ఆస్తినష్టం
- దీపావళి టపాసుల నిప్పురవ్వలతో షోరూమ్‌లో చెలరేగిన మంటలు
- గన్నవరంలో ఫర్నిచర్ దుకాణానికి వ్యాపించిన అగ్నికీలలు
- తిరువూరులో షార్ట్ సర్క్యూట్‌తో మరో దుకాణం దగ్ధం

2లో

అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గేది లేదు

- ఢిల్లీని అయినా ఎదిరించి నిలబడతాం
- కొడంగల్ ప్రజల ఆశీర్వాదమే మా బలం
- తెలంగాణను నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రోజుకు 18 గంటలు రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నా
- కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం
- బియ్యం నిల్వలు పుష్కలం.. ధరల పెరుగుదలపై భయమొద్దు



రంగారెడ్డి **అభ్యుదయం**

'ఢిల్లీలో ఉన్న మోదీకైనా, ఫామ్‌హౌస్‌లో ఉన్న కేడీకైనా భయపడేది లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడ జరిగే అభివృద్ధికి ఎవరైనా తలవంచాల్సిందేనన్నారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదం ఉంటే ఢిల్లీని సైతం ఎదిరించి నిలబడతామని, ప్రధాని మోదీ అయినా, ప్రతిపక్ష నేత కేసీఆర్ అయినా అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గబోమని చెప్పారు. సంక్రాంతి తరువాత ప్రజాబలంతో సునామీ సృష్టిస్తామని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో మూడో రోజు పర్యటనలో భాగంగా సోమవారం

మిగతా 2లో

- సంక్రాంతి తర్వాత ప్రజాబలంతో సునామీ సృష్టిస్తాం
- దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు.. ప్రజలకు తిరిగి ఇచ్చేస్తా
- బియ్యం ధరలపై భయమొద్దు.. ఏడాదికి సరిపడా నిల్వలు
- కేటీఆర్ గడ్డం పెంచుకుంటే రేవంత్‌రెడ్డి కాలేడు
- 2028 డిసెంబరు నాటికి కొడంగల్‌కు కృష్ణా జలాలు
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం
- కొడంగల్‌లో రైతు ఆత్మీయ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య తీరుస్తా

సీఐఐ సదస్సు కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు



ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు

ఏర్పాట్లపై ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో మంత్రి సమీక్ష

అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

2లో

ఓటీ, ఐసీయూలకే ప్రత్యేక దుస్తులు పరిమితం కావాలి


- విధులు ముగిశాక ఇతర ప్రాంతాల్లో తిరగకూడదు
- ఆసుపత్రుల సూపరింటెండెంట్లకు డీఎంఈ ఆదేశాలు



2లో

అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గేది లేదు

కొడంగల్ నివాసం నుంచి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి.. దారిలో పోలెపల్లి ఎల్లమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుంచి లగచర్ల చేరుకుని ఇండస్ట్రియల్‌కారిడార్‌లో నిర్మిస్తున్న ఎకో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వేలాది మందితో కలిసి హకీంపేట బహిరంగ సభ వరకు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన రైతు ఆత్మీయ సభలో మాట్లాడుతూ.. దేవుడు తనకు జడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి వరకు అన్ని అవకాశాలు ఇచ్చాడని, ఇక ప్రజలకు తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. తెలంగాణను నంబర్‌వన్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టేందుకు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నానని, సీఎం అయిన తరువాత ఒక్క రోజూ సెలవు తీసుకోలేదని చెప్పారు.రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, అయితే ఈ సమస్యను కలిసికట్టుగా ఎదుర్కొందామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సాధారణంగా కరువు వస్తే ఆహార ధాన్యాలు, తాగునీటి కొరత ఏర్పడుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం ప్రధానంగా నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని



అన్నారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బియ్యానికి కొదవ లేదని, 12 నెలలకు సరిపడా బియ్యాన్ని ఖజానాలో దాచిపెట్టామని తెలిపారు. ఈ ఒక్క సీజన్‌లో వడ్లు పండించకపోయినా ఏడాదికి సరిపడా సన్న బియ్యం ప్రభుత్వం వద్ద ఉన్నాయన్నారు. ప్రజలు బియ్యం ధరలు పెరుగుతాయని భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

సంక్రాంతి తర్వాత కొడంగల్ నుంచి ప్రజాబలం కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి కరువును ఎదుర్కొనే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెట్టాలనుకున్నానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆనాడు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. “ధనిక రాష్ట్రం, మూడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న తెలంగాణలో ఏడో తారీకు వచ్చినా ఉద్యోగస్తులకు జీతభత్యాలు ఇవ్వడం లేదు. ఎందుకని అడిగితే.. పదేళ్లలో కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు అధికారులు చెప్పారు. నెత్తిమీద అప్పు.. చేతిలో చిప్ప పెట్టి అయ్యగారు పోయి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఇప్పుడే గాడిలో పెడుతున్నాం. 5లక్షల మంది ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలు ఇస్తున్నాం. మిగతా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 5వ తేదీన ఇస్తున్నాం” అని సీఎం వివరించారు. నిజాం పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత ఎంతో మంది నాయకులు తెలంగాణ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించినా పాలమూరు వలసలు ఆగలేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడితే పాలమూరు రైతుల కష్టాలు తీరుతాయని, వలసలు ఆగుతాయని భావించి 2009 ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతిచ్చామని తెలిపారు. ఉద్యమం దెబ్బతినకూడదని విఠల్‌రావును పక్కనపెట్టి కేసీఆర్‌ను పార్లమెంటుకు పంపించామని చెప్పారు.

రాష్ట్రంలో జరిగిన వేర్వేరు అగ్నిప్రమాదాలపై సీఎం ఆరా

అమరావతి, విజయనగరం జిల్లా రాజాం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు అగ్నిప్రమాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. రాజాంలోని ఓ ఆటోమొబైల్ షోరూమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో భారీఎత్తున ఆస్తినష్టం జరిగింది. దీపావళి టపాసులు ప్రమాదవశాత్తు షోరూమ్‌పై పడి మంటలు అంటుకోవటంతో షోరూమ్ దగ్ధమైంది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకుంది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసినట్లు అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలో బాణా సంచా కాలుస్తుండగా నిప్పు రవ్వలు ఎగిరిపడి ఓ ఫర్నిచర్ దుకాణానికి మంటలు అంటుకున్నాయి. తిరువూరులోని మరో దుకాణంలోనూ షార్ట్ సర్క్యూట్



జరిగి దుకాణం దగ్ధమైంది. మంటల కారణంగా ఆస్తినష్టం జరగటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మూడు ఘటనలపై ఆరా తీసిన సీఎం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు.

ఓటీ, ఐసీయూలకే ప్రత్యేక దుస్తులు పరిమితం కావాలి

అమరావతి,ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో రోగులకు అంటువ్యాధులు వ్యాపించకుండా ఆపరేషన్ థియేటర్లు (ఓటీ), అత్యవసర చికిత్స విభాగాల (ఐసీయూ)లో విధులు నిర్వహించే వైద్యులు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్‌లు, నర్సింగ్, ఇతర సిబ్బంది ప్రత్యేక దుస్తులను నిర్దేశిత ప్రాంతాలకే పరిమితం చేయాలని వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ విష్ణువర్ధన్ ఆదేశించారు. విధులు ముగిసిన తర్వాత అదే దుస్తులతో సాధారణ వార్డులు, ఓపీడీలు, కారిడార్లు, కార్యాలయాలు, క్యాంటీన్లు, ఆసుపత్రి ప్రాంగణాల్లో తిరగకూడదని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో ఇప్పటి వరకు మౌఖికంగానే ఆదేశాలున్నాయి. కీలకమైన ఈ విధానం అమలుపై లిఖితపూ ర్వకంగా తొలిసారిగా ఆదేశాలిచ్చారు. ఓటీ, ఐసీయూల్లో ఉపయోగించే ప్రత్యేక దుస్తులతో ఇతర ప్రాంతాల్లో తిరగడం వల్ల సూక్ష్మజీవులు వ్యాపించే ప్రమాదం ఉందని, ఆసుపత్రుల్లో వచ్చే ఇతర ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతుందని పేర్కొన్నారు.

నిర్దేశిత ప్రాంతాలకే పరిమితం:

ఆపరేషన్ థియేటర్ సముదాయాలు, అన్ని ఐసీయూలు, ప్రసవ గదులు, క్యాథ్ ల్యాబ్‌లు, మార్పిడి చికిత్స విభాగాలు, సీసీఎస్‌డీ స్టెరైల్ జోన్‌లలో మాత్రమే ప్రత్యేక దుస్తులు ధరించాలి. సాధారణ వార్డులు, ఓపీడీలు, కారిడార్లు, లిఫ్టులు, వేచి ఉండే ప్రాంతాలు, కార్యాలయాలు, గ్రంథాలయాలు, క్యాంటీన్లు, వసతి గృహాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఆసుపత్రి ప్రాంగణం వెలుపల వీటిని ధరించకూడదు. నిర్దేశిత ప్రాంతాల్లోకి ప్రవేశించే సమయంలో ప్రత్యేక దుస్తులు ధరించాలి. బయటకు వచ్చేటప్పుడు వాటిని తొలగించాలి. టోపీలు, మాస్కులు, షూ కవర్లను బయటకు వెళ్లే ముందు తొలగించాలి. ఓటీ, ఐసీయూలకు కేటాయించిన పాదరక్షలను ఇతర ప్రాంతాల్లో ధరించకూడదు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే ప్రత్యేక దుస్తులపై శుభ్రమైన, శరీరాన్ని పూర్తిగా కప్పే గౌన్ లేదా కోటు ధరించాలి. తిరిగి లోపలికి వెళ్లేటప్పుడు కొత్త ప్రత్యేక దుస్తులు ధరించాలి.

ఆసుపత్రి లాండ్రీలోనే శుభ్రం చేయాలి:

ఆసుపత్రి పర్యవేక్షకులు తగిన సంఖ్యలో ప్రత్యేక దుస్తులను అందుబాటులో ఉంచాలి. ఓటీ, ఐసీయూలకు వేర్వేరు రంగుల దుస్తులు కేటాయించాలని సూచించారు.

తెలంగాణకు మళ్లీ కేసీఆర్ నాయకత్వం ఎందుకు కావాలి?

సొంతింటి కల నెరవేర్చేందుకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం తీసుకొచ్చారు.
తాగునీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ, చెరువుల పునరుద్ధరణకు మిషన్ కాకతీయ, సాగునీటి అభివృద్ధికి కాళేశ్వరం ప్రాజెక్టు, పర్యావరణ పరిరక్షణకు తెలంగాణకు హరితహారం వంటి కార్యక్రమాలు చేపట్టారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంట్ పల్లెల అభివృద్ధి కోసం పల్లె ప్రగతి, పట్టణాల అభివృద్ధికి పట్టణ ప్రగతి, మహిళల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ పథకాలలో కొన్ని ప్రజల నుంచి ప్రశంసలు అందుకోగా, మరికొన్ని అమలు, వ్యయం, లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాల్లో విమర్శలను కూడా ఎదుర్కొన్నాయి.మరి కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఎందుకు కోరుకుంటున్నారు?
తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర, పదేళ్ల పరిపాలనా అనుభవం, రైతుబంధు వంటి సంక్షేమ పథకాల వారసత్వం, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు ఆయనకు ఉన్న రాజకీయ బలాలుగా ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు. గత పాలనలోని లోపాలను సరిదిద్ది, యువతకు ఉద్యోగాలు, రైతులకు మెరుగైన ఆదాయం, పేదలకు మరింత భరోసా కల్పించాలనే ఆశలను కూడా వారు వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ భవిష్యత్తు కోసం గత పాలనలోని విజయాలు, వైఫల్యాలను బేరీజు వేసుకోవడం అవసరం. అయితే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలా వద్దా అనేది అంతిమంగా ప్రజల నిర్ణయమే.తెలంగాణ ఆత్మగౌరవం, అభివృద్ధి, సంక్షేమం, రైతు సంక్షేమం... ఈ నాలుగు అంశాలే రాష్ట్ర భవిష్యత్తు రాజకీయాలకు దిశానిర్దేశం చేయాలి.ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే నాయకత్వమే తెలంగాణకు అవసరం. ఆ మార్పు కోసం ప్రజలు ఎవరిని ఎంచుకుంటారో కాలమే నిర్ణయిస్తుంది.ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే నాయకత్వమే తెలంగాణకు అవసరం. ఆ మార్పు కోసం ప్రజలు ఎవరిని ఎంచుకుంటారో కాలమే నిర్ణయిస్తుంది.

పిల్లలమర్రి న్యూస్
అజయ్ కౌండిన్య. ఎడిటర్.
రేపు. మిగితాది చెబుతా..వజూఅంశీనవ 01

ఏపీ పారిశ్రామిక ప్రగతికి నూతన దశదిశ

హాజరయ్యేందుకు ఇప్పటికే నమోదు చేసుకున్నారు. ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల్ని అనుసంధానించటమే లక్ష్యంగా ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా నిలిచేలా ఈ సదస్సులో చర్చలు, ఒప్పందాలు జరుగనున్నాయి. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, సాంకేతికత, పరస్పర విశ్వాసం, నిపుణుల దార్శనిక ఆలోచనలకు ప్రాధాన్యమిస్తూ చర్చలు సాగనున్నాయి. ప్రపంచ దేశాలతో భారత ఆర్థిక భాగస్వామ్యానికి ప్రధాన వేదికగా ఈ సదస్సును 1995 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ పెట్టుబడుల సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమ్మిట్‌కు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 58 దేశాల ప్రాతినిధ్యం, 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు ఈ సమ్మిట్ కు హాజరు కానున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా తదితర దేశాల ప్రభుత్వ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. విధ దేశాల రాయబారులు, పారిశ్రామిక ప్రముఖులు, సాంకేతిక నిపుణులతో పాటు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, ఏడీబీ, యునెప్ లాంటి సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఈ సదస్సులో భాగంగా 400 పైచిలుకు బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు నిర్వహించనున్నారు. దీంతో పాటు ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బీ టూ జీ సమావేశాలు కూడా జరుగనున్నాయి.

ఏపీ ఉమెన్ గ్రోత్ సమ్మిట్ 2026:

పెట్టుబడుల సదస్సులో భాగంగా ఈ నెల 11 తేదీన పారిశ్రామిక ప్రతినిధుల మధ్య ముందస్తు సమావేశాలు జరుగనున్నాయి. అదే రోజు రాత్రి 8 గంటలకు ముఖ్యమంత్రి అధికారిక విందు ఇవ్వనున్నారు. విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్స్ లో 12, 13 తేదీల్లో ప్రధాన సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్ 2026 నిర్వహిస్తారు. 12 తేదీ ఉదయం 9.30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పీయూష్ గోయెల్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి నారా లోకేష్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధి రాబర్టో తదితరులు సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రారంభించనున్నారు. ఇక నవంబర్ 13, సాయంత్రం 4 గంటలకు సదస్సు ముగింపు కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, వాల్యూచైన్, క్వాంటం టెక్నాలజీ, సెమీ కండక్టర్ సహా నూతన సాంకేతికతలు, అంతర్జాతీయ సహకారం, నైపుణ్యాలు, గత పెట్టుబడుల సదస్సు సహా వివిధ సందర్భాల్లో ఒప్పందాలను పారిశ్రామిక ప్రాజెక్టులుగా మలిచేందుకు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మంత్రులు, అధికారుల కమిటీని నియమించింది.

సీఐఐ సదస్సు కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

అమరావతి, విశాఖలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సీఐఐ సదస్సు ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తో సోమవారం అమరావతి నుంచి జామ్ వేదికగా మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు మంత్రి పలు సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో పనిచేసి సదస్సును విజయవంతం చేయాలన్నారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ సీఐఐ సదస్సు కోసం ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్, ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' థీమ్‌తో సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు సుమారు 59 దేశాల నుంచి ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు హాజరవుతారు, మొత్తం 1,250 మందికి పైగా దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, పాలసీ మేకర్లు హాజరవుతారు. వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటింగ్, టెక్నాలజీ ఇన్నోవేషన్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి ఆరు కీలక రంగాలపై సదస్సులో ప్రధానంగా చర్చలు జరుగుతాయని మంత్రి తెలిపారు. వైసిపి పార్టీ హయాంలో రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందని నేడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర సమగ్ర ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిని పరుగులెత్తించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.ం

చర్చలు, దౌత్యంతోనే యద్ధానికి పరిష్కారం..

జెలెన్‌స్కీతో ఫోన్‌లో మోదీ

ఉక్రెయిన్ అధ్యక్షుడు ఓలోదిమిర్ జెలెన్‌స్కీకి ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఫోన్ చేశారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కారం కనుగొనాలని ఆయన సూచించారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా చేసే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.
ప్రస్తుత సంక్షోభంలో మానవతా కోణానికే భారత్ అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. అలాగే ఇరు దేశాల మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకా రాన్ని మరింత బలోపేతం చేసుకునే అంశాలపైనా ఇద్దరు నేతలు చర్చించారు.

రష్యా కూడా ముందుకు రావాలి: జెలెన్‌స్కీ

మోదీతో ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని జెలెన్‌స్కీ 'ఎక్స్'లో వెల్లడించారు. తాజా దౌత్య పరిణామాలతో పాటు అబుధాబిలో జరగనున్న సమావేశానికి ఉక్రెయిన్ చేస్తున్న సన్నాహాల గురించి కూడా
మోదీకి వివరించానని ఆయన తెలిపారు. యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రెయిన్ ముందుకు వెళ్తోందని, రష్యా కూడా అదే విధంగా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ముందుకు రావాలన్నారు. ఇది యుద్ధాన్ని కొనసాగించే సమయం కాదని, ముగించాల్సిన సమయమని మోదీ పలుమార్లు స్పష్టం చేసినట్లు జెలెన్‌స్కీ గుర్తుచేశారు.

ఏఐ ఆధారిత సైబర్ దాడులపై బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, నవంబర్ 9: నగరంలో ఏఐ ఆధారిత సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు జారీ చేశారు.'నగరంలో ఏఐ ఆధారిత సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో.. బ్యాంకులు, క్విక్ కామర్స్, మొబిలిటీ సంస్థలు, సైబర్ భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలి. థర్డ్ పార్టీ మాడ్యూళ్లు, ఏపీఐ సేవలకు కూడా పటిష్ఠమైన భద్రత కల్పించుకోవాలి. పాత సాఫ్ట్‌వేర్లు, భద్రతా లోపాలు, కస్టమర్ పోర్టళ్లను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఏఐ ఏజెంట్ల సాయంతో నెట్‌వర్క్ లోపాలను గుర్తించి మ్యూల్ ఖాతాల్లోకి కోట్ల రూపాయలను హ్యాకర్లు మళ్లిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా.. వినియోగంలో లేని పాత ఏపీఐలను తొలగించి, సాఫ్ట్‌వేర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం ఉత్తమం. భారీ లావాదేవీలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలి. కేవైసీ తనిఖీలను తప్పనిసరిగా ఉన్నతాధికారుల అనుమతితోనే చేయాలి' అని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణలో బియ్యం ధరల నియంత్రణకు చర్యలు



హైదరాబాద్, నవంబర్11: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. బియ్యం ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కనిష్ఠంగా కిలో బియ్యం ధర రూ.66గా.. గరిష్ఠంగా రూ.79గా నిర్ణయించింది.హెచ్ఎంటీ, జేఎస్ఆర్ బియ్యం గరిష్ఠ ధర రూ.79గా నిర్ణయించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే చర్యలు తీసుకుంటామని బియ్యం వ్యాపారులు, రైస్ మిల్లు యజమానులను హెచ్చరించింది. దీూ ఖచీవీ ధర రూ.66, తెలంగాణ సోనా రూ.74, ఎమీ రకం రూ.79గా నిర్ణయించినట్లు వెల్లడించింది.
బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు: చీఫ్ రేషనింగ్ ఆఫీసర్
రాష్ట్రంలో బియ్యం కొరతపై వస్తున్న వార్తలు అవాస్తవమని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. బియ్యం బస్తాపై ఎమ్మార్పీ (వీక్రా) దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించే దళారులపై నిఘా ఉంచామని అన్నారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు.

కార్తీక శోభకు సిద్ధమైన శ్రీశైల మహాక్షేత్రం..

శ్రీశైలం, హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణలతో మార్మోగే పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీశైలంలో కార్తీకమాసోత్సవాలకు రంగం సిద్ధమైంది. నవంబరు 10 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు నెలరోజులపాటు నిర్వహించనున్న కార్తీకమాసోత్సవాలకు శ్రీశైల దేవస్థానం అన్ని ఏర్పాట్లను చేపట్టింది. కార్తీకమాసం శివారాధనకు అత్యంత విశిష్టమైనది కావడంతో స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతోపాటు వసతి, అన్నప్రసాదం, పుణ్యస్నానాలు, పారిశుద్ధ్యం, భద్రత, రవాణా తదితర సౌకర్యాలపై దేవస్థానం ప్రత్యేక దృష్టి సారించింది. ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. కార్తీకమాసం మొత్తం భక్తుల రద్దీ అధికంగా ఉండనున్నందున గర్భాలయ అభిషేకాలు, సామూహిక ఆర్జిత అభిషేకాలను నిలుపుదల చేయాలని నిర్ణయించారు. భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు శని, ఆదివారాలు, సోమవారాలు, పర్వదినాల్లో స్వామివారి స్పర్శదర్శనాన్ని పూర్తిగా నిలిపివేయనున్నారు. సాధారణ రోజుల్లో మాత్రం రోజుకు ఐదు విడతలుగా నిర్దిష్ట సమయాల్లో స్పర్శదర్శనానికి అవకాశం కల్పించనున్నారు. ఆలయ ద్వారాలను ప్రతిరోజూ వేకువజామున 3 గంటలకు తెరిచి ప్రాతఃకాల పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 4.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి దర్శనాలు కల్పించనున్నారు. అమ్మవారి కుంకుమార్చనలు రద్దీ రోజుల్లో ఆశీర్వచన మండపంలో నిర్వహించనుండగా, రుద్రహోమం, చండీహోమం, సాక్షిగణపతి హోమం, నిత్యకల్యాణం వంటి ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. కార్తీకమాసంలో భక్తుల అభీష్టం మేరకు పంచమఠాల్లో అభిషేకాలు నిర్వహించుకునేందుకు దేవస్థానం ప్రత్యేక అవకాశం కల్పించింది. రుసుముతో ఆర్జిత అభిషేకం చేసుకునే సదుపాయం కల్పించింది. ఈ టికెట్లను మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009, ఏపిటీఎస్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. అభిషేకానికి అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే అందించ నుంది. భక్తులకు నిరంతర అన్నప్రసాద వితరణ చేపట్టడంతోపాటు ఉదయం



10.45 గంటల నుంచి అన్నప్రసాదాలు, సాయంత్రం 7 గంటల నుంచి అల్పాహారం అందించనున్నారు. క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉండే భక్తులకు మంచినీరు, బిస్కెట్లు, అల్పాహారం పంపిణీ చేయనున్నారు. రద్దీ అధికంగా ఉండే రోజుల్లో ఉదయం వేళ వేడిపాలు కూడా అందించనున్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేసి, ప్రస్తుతం ఉన్న కౌంటర్లకు అదనంగా మరో ఆరు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో మొత్తం 14 కౌంటర్ల ద్వారా ప్రసాదాల విక్రయాలు చేపట్టనున్నారు. కార్తీకమాసంలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల కోసం పాతాళగంగ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు



చార్మినార్, నవంబర్ 9 దీపావళి మహోత్సవాల్లో భాగంగా చార్మినార్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి దేవాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనం కోసం వేలాది మంది తరలిరావడంతో చార్మినార్ పరిసరాలు సందడిగా మారాయి. ప్రముఖులు సైతం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.భక్తుల రద్దీ పెరగడంతో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ, చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేకంగా 10 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చార్మినార్ నుంచి గుల్జార్ హౌజ్ వరకు భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ శశికళ ఆధ్వర్యంలో వీఐపీ భక్తుల కోసం వెండితో ప్రత్యేక నాణాలను తయారు చేయించారు. వాటిపై ఒకవైపు భాగ్యలక్ష్మి అమ్మవారి ప్రతిమను, మరోవైపు చారిత్రక చార్మినార్ చిత్రాన్ని ముద్రించారు. దీపావళి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ప్రత్యేకంగా తయారు చేసిన నాణాలను కానుకగా అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో లక్ష నాణాలతో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం ఆదివారం రాత్రి 7 గంటల నుంచి భక్తులకు నాణాలను అందజేస్తున్నారు.

ఇప్పటివరకు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, స్వామి గౌడ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె, టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎల్. రమణ, వీహెచ్‌పీ నేత సత్యం, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కె. సత్యనారాయణ తదితరులు ఉన్నారు. వీరంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్థానిక ఎన్నికల ఫలితాలను వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.. మంత్రి

నెల్లూరు,స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరు ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన విజయాన్నికూటమికి అందించారని వ్యాఖ్యానించారు. ఈరోజు (సోమవారం) నెల్లూరులో మంత్రి ఆనం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రెండున్నరేళ్లలో గతంలో ఎన్నడూ లేనంతగా సంక్షేమం, అభివృద్ధి పనులు తమ హయాంలో జరిగాయని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే, ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ కూటమి పార్టీలకు మెజార్టీ పెరిగిందని చెప్పుకొచ్చారు.మేకపాటి సొంతూరులోనూ టీడీపీ విజయం సాధించిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తావించారు. దానిని బట్టి ఎంత ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయో అర్థమవుతోందని అన్నారు. రాజకీయాల్లోకి కార్పొరేట్ శక్తులు వచ్చాయిని చెప్పారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పుడు బాధపడలేదని, ప్రజానిర్ణయాన్ని గౌరవంగా స్వీకరించామని తెలిపారు. వైసీపీ నేతలకు ప్రజాస్వామ్య వ్యవస్థపై గౌరవం లేదని మండిపడ్డారు. జగన్ హయాంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి తమపై, అధికారులపై, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి ముందు వైసీపీ నేతలు తెలుసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తమ గురించి వైసీపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

ఎన్విడియా సీఈఓపై మేము గూఢచర్యం చేయలేదు: చైనా



ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌పై తాము గూఢచర్యం చేశామన్న ఆరోపణలను చైనా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని, తమపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగానే అలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా పత్రిక ద న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన ఓ కథనం ఈ వివాదానికి కారణమైంది. చైనా పౌరురాలు, వ్యాపారవేత్త ఆలిస్ హువాంగ్‌తో జెన్సన్ హువాంగ్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, బీజింగ్‌కు ఆమె నిఘా సమాచారాన్ని అందించే వ్యక్తి అయి ఉండొచ్చని ఆ కథనంలో

ఈ నేపథ్యంలో జెన్సన్ హువాంగ్ స్పందించారు. తన భార్యకు ద్రోహం చేశానని ఆయన అంగీకరించారు. ఇందుకు తన భార్యాపిల్లలకు ఆయన క్షమాపణలు చెప్పారు. తాను చేసిన తప్పును సమర్థించుకోవడం లేదని సంస్థ ఉద్యోగులకు ఒక సందేశం పంపారు. తాను చేసిన పని కారణంగా తన భార్యాపిల్లలు బాధపడ్డారని విచారం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై ఎన్విడియా స్పందించింది. ఆ ఆరోపణలపై దర్యాప్తు చేపడతామని వెల్లడించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో ఎన్విడియా షేర్లు దాదాపు 5 శాతం పడిపోయాయి.

చైనాకు చిప్‌ల విక్రయాల కోసం హువాంగ్ ఒత్తిడి

చైనాకు చిప్‌ల విక్రయాలపై అమెరికా ఆంక్షలను సడలించాలని జెన్సన్ హువాంగ్ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నారని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) వెల్లడించింది. ఈ ఏడాది హెచ్ 200 చిప్‌లను చైనాకు విక్రయించేందుకు అనుమతించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆయన ఒత్తిడి తెచ్చారని పేర్కొంది. అయితే ఈ చిప్‌లను తమ కంపెనీలు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసేందుకు చైనా ప్రభుత్వం అనుమతిస్తుందా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. చైనా ప్రభుత్వ ఆంక్షల కారణంగా ఆ దేశానికి పరిమిత స్థాయిలోనే చిప్‌లను విక్రయించామని ఎన్విడియా ఈ ఏడాది ఆగస్టులో ఒక నివేదికలో పేర్కొంది. కాగా.. ఈ వివాదంపై చైనా మీడియా హువాంగ్ వ్యక్తిగత సంబంధాల అంశాన్నే ప్రస్తావిస్తోంది. అమెరికా-చైనా సంబంధాలను దెబ్బతీసే ఉద్దేశంతోనే న్యూయార్క్ టైమ్స్ ఆ కథనాన్ని ప్రచురించిందని కొన్ని మీడియా సంస్థలు వ్యాఖ్యానించాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్న ప్రతిసారీ కొందరు కుట్రపూరితంగా దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని చైనా ప్రభుత్వానికి చెందిన గ్లోబల్ టైమ్స్ పేర్కొంది.

ముంబైలో ఏరియల్ ఫైర్ క్రాకర్స్‌పై నిషేధం

: దీపావళి వేడుకల్లో అగ్నిప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ముంబై విపత్తు నిర్వహణ సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. రాకెట్లు, గాల్లోకి ఎగిరి పేలిపోయే ఏరియల్ ఫైర్ క్రాకర్స్‌ను నవంబర్ 25 వరకూ నిషేధిస్తున్నట్టు తెలిపింది. నగరవ్యాప్తంగా ఈ నిషేధం అమల్లో ఉంటుందని చెప్పింది. పబ్లిక్, ప్రైవేటు ప్రదేశాలతో పాటు భవనాలు, టెర్రస్‌లు, బాల్కనీలు, పార్కింగ్ స్థలాలు, స్లమ్ ఏరియాలు సహా ఎక్కడా ఈ టపాసులను కాల్చకూడదని స్పష్టం చేసింది. నేటి నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిషేధం నవంబర్ 25 రాత్రి 11.59 గంటల వరకూ అమల్లో ఉంటుందని నగర విపత్తు నిర్వహణ సంస్థ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

రాకెట్లు, గాల్లోకి ఎగిరి పేలే ఇతర టపాసులు భవనాలపై, బాల్కనీలు, కిటికీలు, పేలుడు పదార్థాలపై పడి అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాలు, బహుళ అంతస్తుల భవనాలు, ఇరుకు సందులు, వాణిజ్య సముదాయాలకు ఏరియల్ ఫైర్ క్రాకర్స్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం ముప్పు మరింత ఎక్కువగా ఉందని తెలిపింది. ఈ అంశంపై ముంబై మేయర్ నీతు తావ్డే మాట్లాడుతూ భవనాలకు సమీపంలో టపాసులు కాల్చవద్దని ప్రజలకు విజ్ఞప్తి కూడా చేశారు.నవంబర్ 8న నగరంలో 137 అగ్నిప్రమాదాలు జరిగిన నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఘటనల్లో ఇద్దరు మహిళలు గాయపడ్డట్టు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. టపాసుల వల్ల అగ్నిప్రమాదాల సంఖ్య గతంతో పోలిస్తే పెరిగిందని అధికారులు చెబుతున్నారు. దీపావళి సందర్భంగా 2024లో ముంబైలో 262 అగ్నిప్రమాదాలు సంభవించాయి. వీటిల్లో 80 టపాసుల వల్లే జరిగాయి.

'ఇలా బ్యాలెట్ బాక్సులు మార్చే అక్రమంగా గెలిచారు'



తాడేపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలను ఫ్రీ అండ్ ఫెయిర్ గా నిర్వహించామని సీఎం చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు విమర్శించారు. అసలు ఇలాంటి ఎన్నికలు గతంలో చూడలేదని, భవిష్యత్‌లో కూడా చూడమన్నారు. చంద్రబాబు ఓ మాఫియా డాన్‌గా మాదిరిగా వ్యవహరించి ఎన్నికలను నిర్వహించి.. ఇప్పుడు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా ఎన్నికలు నిర్వహించామని చెప్పడం సిగ్గుచేటన్నారు. తమ పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాలను చంద్రబాబు టార్గెట్ చేసి మరీ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. 'వెంగళాయపాలెం బ్యాకెట్ బాక్సును మార్చటానికి టీడీపీ నేతలు ప్రయత్నించారు. పోలింగ్ అధికారి బస్సులో నుండి బాక్సును ఎలా దించుతారు?, బస్సులో ఖాలీ లేదని బస్సు దిగాడని కలెక్టరు చెప్పటం సిగ్గుచేటు. ఇలా బ్యాలెట్ బాక్సులు మార్చే చాలాచోట్ల అన్యాయంగా గెలిచారు. బ్యాలెట్ బాక్సుతో బస్సు దిగటం తప్పయిందని అధికారే ఒప్పుకున్నాడు.మరి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చేసిన తప్పేంటి?, లేళ్ల అప్పిరెడ్డిపై తప్పుడు కేసు పెట్టి జైలు పాలు చేశారు. ఆయనపై ఎందుకు కేసు పెట్టి అరెస్టు చేశారు?, తప్పుడు మాటలు మాట్లాడుతున్న టీడీపీ నేతలు ఆత్మవంచన చేసుకుంటున్నారు. ఆలపాటి రాజా, పిల్లి మాణిక్యరావు, తప్పుడు మాటలు, పచ్చి అబద్దాలు ఎలా చెప్తారు?, ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిచ్చు పెట్టారు. పెత్తందార్లకు వ్యతిరేకంగా పోటీ చశారని దళితులను కొట్టారు' అని ధ్వజమెత్తారు.

ఎమ్మిగనూరు కూటమిలో భగ్గుమన్న వర్గ విభేదాలు



కర్నూలు , కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు కూటమిలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డిపై జనసేన ఎన్నికల సమన్వయకర్త చల్లా శ్రీ వరుణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో జనసేన, బీజేపీని దెబ్బతీసేలా ఎమ్మెల్యే అరాచకాలు చేశారని ఆరోపించారు"మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి ధర్మంలో 13 సీట్లు జనసేన ఇవ్వాల్సి ఉండగా ఒక్క సీటు కూడా కేటాయించలేదు. పార్టీ ఆదేశాల మేరకు ఆరు వార్డులో జనసేన అభ్యర్థులు నామినేషన్లు వేస్తే, ఐదు చోట్ల టీడీపీ అభ్యర్థులను పోటీలో దించి, జనసేనను ఎమ్మెల్యే ఓడించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని ఎమ్మెల్యే తుంగలోతొక్కారు.ఎమ్మిగనూరు జడ్పీటీసీని జనసేనకు కేటాయించి క్రాస్ ఓటింగ్ ద్వారా జనసేన అభ్యర్థిని ఎమ్మెల్యే ఓడిచ్చారు.

నందవరం, గోనెగండ్ల మండలాల్లో జనసేన తరఫున పోటీ చేసిన అభ్యర్థులకు పోటుగా టీడీసీ అభ్యర్థులను దింపి జనసేన ఓటమికి ఎమ్మెల్యే కారణమయ్యారు. ఎమ్మిగనూరులో జనసేన ఫ్లెక్సీలు జెండాలు దిమ్మలు పడగొట్టిస్తూ పార్టీని సర్వనాశనం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు" అని చెప్పారు.

కర్నూలులో ఘోర ప్రమాదం!

పని ముగించుకుని తిరిగొస్తున్న ఆటో..

కర్నూలు: జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆదోని మండలం నెట్టేకల్ క్రాస్ వద్ద ఓ ఆటో.. కారును బలంగా ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ, కర్నూలు జిల్లాలోని, ఆదోని మండలం నెట్టేకల్ క్రాస్‌రోడ్డు వద్ద వలస కూలీలకు వెళ్ళి, తిరిగి వస్తుండగా ఓ ఆటో అదుపుతప్పి కారును బలంగా ఢీకొంది. దీంతో ఈ ఘటనలో మహేశ్వరి (25) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న మరో 10 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు.

అయితే, ఈ ప్రమాదానికి గురైన వారంతా ఆదోని మండలం కపటి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ప్రమాదానికి గల ఇతర కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

జీలుగుమిల్లి మండలంలో వైఎస్సార్సీపీ ఘన విజయం

● వైయస్సార్సీపీకి ప్రత్యర్థులు జీర్ణించుకోలేని విజయం అందించిన

● ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపిన : మండల పార్టీ ప్రెసిడెంట్ చందా ప్రసాద్

జీలుగుమిల్లి నవంబర్ 9 :- ఏలూరు జిల్లా పోలవరం నియోజక వర్గం జీలుగుమిల్లి మండల ప్రజలు వైఎస్సార్సీపీ వెంటే ఉన్నామని మరోసారి స్పష్టం చేశారని, పార్టీకి ఘన విజయం అందించిన ప్రతి ఒక్కరికీ మండల పార్టీ ప్రెసిడెంట్ చందా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది వైఎస్ఆర్సిపి కి ప్రజాబలం లేదని కూటములోని అనైక్యత వల్ల వైఎస్ఆర్ సీపీ గెలిచిందని మాట్లాడుతున్నారు

ఈ సందర్భంగా ఆయన కూటమి నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూటమి అత్యంత బలంగా ఉన్న సమయంలో సైతం, జీలుగుమిల్లి మండల ప్రజలు వైయస్సార్సీపీకి 3,300 పైచిలుకు భారీ మెజారిటీని అందించారనే వాస్తవాన్ని కూటమి నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ఓటమికి స్వతంత్ర అభ్యర్థులు, రెబల్స్ కారణమని సీనియర్ నాయకులు అనడం హాస్యాస్పదమన్నారు. రెబల్ కాండిడేట్స్ కు రెండు పార్టీల నుండి క్రాస్ ఓట్లు వస్తాయని అవగాహన లేనట్టుంది అని అన్నారు. కేవలం మూడు చోట్ల మాత్రమే రెబల్స్ ఉన్నారంటున్న వారు, మిగతా ఆరు స్థానాలు ఎందుకు కోల్పోయారని ప్రశ్నించారు.

ముఖ్యంగా ఎలాంటి రెబల్స్ సమస్య లేని జడ్పిటిసి స్థానంలోనూ కూటమి అభ్యర్థి ఎందుకు ఓడిపోయిందో సమాధానం చెప్పాలన్నారు. ఓటమిని హుందాగా అంగీకరించి, పరిపాలనలో జరుగుతున్న లోపాలను ప్రజా వ్యతిరేకతను గమనించి సరిదిద్దుకుని ముందుకు వెళ్లాలని చందా ప్రసాద్ హితవు పలికారు. అది వదిలేసి " గెలుపు మాదే" అంటూ ప్రగాల్భాలు పలకడం ప్రత్యక్షంగా ప్రజా తీర్పును అవమానించడ మేనని ధ్వజమెత్తారు. జీలుగుమిల్లి మండల ప్రజలు వైఎస్ఆర్సీపీకి అందించిన ఈ ఆదరణ



చిరస్మరణీయమని రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజలు ఇదే రీతిలో తమ పార్టీని ఆశీర్వదిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు ఎన్డీఏ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం...

● కూటమి నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి అనిర్వచనీయమంటూ వారందరికీ పాదాభివందనాలు తెలియజేసిన ఎమ్మెల్యే బండారు...

● రావులపాలెంలో ఆరు ఎంపీటీసీ స్థానాలను సామాన్యులు గెలుచుకోవడం ద్వారా చారిత్రాత్మక విజయం సాధించాం...

● ఎన్నికల ముందు వైసీపీ నాయకులు చేసిన దుష్ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టారు...

● 2024లో జగన్ కు 11 స్థానాలు, నేడు కొత్తపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి 11 ఎంపీటీసీ స్థానాలు...

● మరింత అభివృద్ధి తో ప్రజల మనసులను గెలుచుకుంటూనే ఉంటాం...

● మీడియా సమావేశంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...





కొత్తపేట, నవంబర్ 9

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు ఎన్డీఏ ప్రభుత్వం పనితీరుకు నిదర్శనంగా నిలిచిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్తపేట జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్, భాజపా నేత తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఆకుల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డి తదితరులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ముందుగా మండల,జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి ఆయన మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం, గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎన్డీఏ కూటమి పాలన నిరంతరం కొనసాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారనడానికి దర్పణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కనిపిస్తుందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు జడ్పిటీసీలు, 86 ఎంపీటీసీ స్థానాలు ఉంటే 75 ఎంపీటీసీ స్థానాలు కూటమి తరపున తెలుగుదేశం, జనసేన, భాజపా అభ్యర్థులు కైవసం చేసుకున్నారన్నారు. నాలుగు జడ్పిటీసీలను కూటమి అభ్యర్థులు గెల్చుకున్నారన్నారు. ఈ విధంగా ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈనాడు కొత్తపేట నియోజకవర్గంలో ప్రజలు కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారన్నారు. ఇప్పటికీ ఏడుసార్లు మండల పరిషత్ ఎన్నికలు జరగగా, ఆరుసార్లు పొందని ఫలితాలు సైతం తెలుగుదేశం, జనసేన, భాజపా తరపున ఎన్డీఏ కూటమి మంచి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. ఎన్టీ రామారావు 1986లో మండల వ్యవస్థ ఏర్పాటు చేశాక రావులపాలెం మండల పరిషత్ లో ఆరు దఫాలుగా తెలుగుదేశం పార్టీ గెలుచుకోవడానికి ప్రయత్నం చేసిందని అయితే సఫలం కాలేదన్నారు.40 సంవత్సరాల తర్వాత ఏడవ సారి జరిగిన ఈ మండల పరిషత్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మండల పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకోవడమనేది చారిత్రాత్మక విజయంగా,గొప్ప రికార్డుగా ఎమ్మెల్యే అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీకి వెనుకబడిన తరగతులకు ఉన్న అనుబంధం ఎటువంటిదో అందరికీ తెలిసిందేనన్నారు. కనుక తెలుగుదేశం పార్టీ తరఫున తొలిసారిగా దక్కిన రావులపాలెం ఎంపీపీ స్థానం వెనుకబడిన తరగతులకు చెందిన నాయకురాలికి దక్కడం మరింత సంతోషంగా కలిగిస్తుందన్నారు. రావులపాలెం మండల పరిషత్ లో 24 ఎంపీటీసీ స్థానాలు ఉంటే 17 స్థానాలు కూటమి కైవసం చేసుకుందన్నారు.

నవంబర్ 11నపరమేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే నెహ్రూకు ఆహ్వానం



గోకవరం, నవంబర్ 9, గాజింగం సత్తిబాబు , పాలూరి బోసు బాబు ఆధ్వర్యంలో శివయ్య విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను రాజా విద్యాసంస్థలు అధినేత పట్నాల సూర్య ప్రకాషరావు , రమనాగలక్ష్మి దంపతులు , లక్ష్మి సాయి జూయలర్స్ అధినేత పట్నాల నాగేంద్ర మర్యాదపూర్వ కంగా కలిసి ఆహ్వానించారు. ఈసందర్భంగా పట్నాల సూర్య ప్రకాషరావు మాట్లాడుతూ గోకవరం ప్రధాన రహదారిలో ఉన్న శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం (శివాలయం)లో కోనేరు మధ్యలో ర్యాంపు వేసి మా తల్లిదండ్రులు పట్నాల పాపారావు శ్రీమతి ప్రభావతి జ్ఞాపకార్థం ఏర్పాటు చేస్తున్న పరమేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆహ్వానించామన్నారు. 11 తేదీ బుధవారం ఉదయం 8గంటలకు హోమం జరిపించి ,ఉదయం 10 గంటల 14 నిమిషాలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులమీదుగా శివుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. హిందువులు పవిత్రంగా భావించే కార్తీక మాసంలో జరుగు పరమేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు అందరూ పాల్గొని శివయ్య అనుగ్రహం పొందాలని పట్నాల సూర్య ప్రకాషరావు రమనాగలక్ష్మి దంపతులు తెలిపారు.

కూటమి అభ్యర్థులు అఖండ విజయం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆశీస్సులు తీసుకున్న నూతన ప్రజాప్రతినిధులు.

● ఎంపీపీగా జనపరెడ్డి హిమ శైలు బాబు, జడ్పీటీసీగా టినా కేర్లిన్ లకుఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘన సత్కారం:



గోకవరం, నవంబర్ 9,: గోకవరం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పార్టీల నూతన ప్రజాప్రతినిధులు జగ్గంపేట శాసనసభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. గోకవరం మండలంలో ఎంపీపీ అభ్యర్థిగా విజయం సాధించిన జనపరెడ్డి హిమ శైలు సుబ్బారావు (కొత్తపల్లి బాబు), జడ్పీటీసీగా విజయం సాధించిన కన్నబాబు కుమార్తె డాక్టర్ టినా కేర్లిన్ మండలంలో విజయం సాధించిన కూటమి పార్టీల ఎంపీటీసీలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిశారు. సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. గోకవరం మండల ప్రజలు కూటమికి అందించిన భారీ మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి చేర్చాలని నూతన ప్రజాప్రతినిధులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు, అడపా భరత్, పిల్లా చంటిబాబు, ఉంగరాల రాము, గాజింగం సత్తిబాబు, పోతాబతులు శ్రీను, పాలూరి బోసు బాబు, ఉంగరాల గణేష్, ఎస్ బాబు, అర్జున్ రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోకవరంలో బాణసంచా షాపుల పర్మిషన్ల దందా?

ఒక్కో షాపు నుంచి ?18,000 వసూలు.. 'పెద్దమనిషి' పాత్రపై సర్వత్రా చర్చ!

గోకవరం , ఇ గోకవరంలో దీపావళి బాణసంచా షాపుల అనుమతుల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫైర్, పోలీస్ తదితర శాఖల అనుమతుల పేరుతో ఒక్కో షాపు యజమాని నుంచి సుమారు ?18,000 వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం 12 షాపుల నుంచి ?2,20,000 పైచిలుకు రికవరీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

మధ్యవర్తిత్వం వహించిన ఆ 'పెద్దమనిషి' ఎవరు?

సేకరించిన భారీ మొత్తంలో ఏ అధికారిక రుసుము ఎంత? ఎవరికి ఎంత ముట్టింది? అనే కోణంలో విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో గోకవరానికి చెందిన ఒక 'పెద్దమనిషి' కీలక పాత్ర పోషించారనే వార్త స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. మండలంలో క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ప్రతి చిన్న విషయానికి మధ్యవర్తిత్వం నడుస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోకవరంతో పాటు గుమ్మళ్లదొడ్డి (1), కొత్తపల్లి (2), తంటికొండ (1), మల్లవరం పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే తరహా వ్యాపారం సాగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శాఖల ప్రతిష్ఠపై ప్రశ్నలు -- అధికారుల స్పందన ఏది?

శాఖాపరంగా జరగాల్సిన అనుమతుల ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యం పెరగడంపై ఫైర్, పోలీస్ అధికారుల పాత్రపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ వసూళ్ల దందాపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిష్పాక్షిక విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో గిరిజన హైందవ చైతన్యం.

100 మంది గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేసిన దాత పట్నాల నాగేంద్ర



గోకవరం: (9 -11- 26 గోకవరం గ్రామంలో స్థానిక సూర్య పీఠం ప్రాంగణంలో సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో గిరిజన హైందవ చైతన్యం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూర్య పీఠం ట్రస్టు ఫౌండర్ ట్రస్టి తోట సాయిబాబు గిరిజన భక్తులకు సూర్యోపాసన విధానాన్ని మహిమను మరియు వైదిక జీవన విధానములో మౌలిక సూత్రంలను ప్రబోధించారు. ఈ సందర్భంగా తోట సాయిబాబు మాట్లాడుతూ సామాజిక అసమానతల నిర్మూలన ద్వారా మాత్రమే సనాతన ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని కావున సామాజిక అసమానతల నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా గిరిజన దళిత హైందవ చైతన్యం నిర్వహిస్తున్నామన్నారు.ఇటువంటి కార్యక్రమాల వలన అన్ని కులాల మధ్యలో చక్కటి సమన్వయము స్నేహము ఏర్పడి దేశం శాంతియుతంగా వర్ధిల్లుతుందన్నారు.ఈ కార్యక్రమం లో అక్షింతల రాజా,దోసపాటి సుబ్బారావు,కొత్తపల్లి సత్యనారా యణ, కొరిపిల్లి అప్పలస్వామి,పిల్లంగోరు పాపారావు,దేవిశెట్టి చక్రరావు, నందినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో నృత్య ప్రదర్శన ఇచ్చిన రావులపాలెం నాట్యాచారిణి కొల్లేపర ఫణిన్మయి.

రావులపాలెం,నవంబర్ 9. దేశసమైక్య,సమగ్రతకు ప్రతీకగా నిలిచే సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వేడుకలను పురస్కరించుకుని గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ మహోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ నృత్యకళ కూచిపూడికి అరుదైన గౌరవం దక్కింది.

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి రావులపాలెంకు చెందిన నాట్యాచారిణి కొల్లేపర ఫణిన్మయి విశేష గుర్తింపు పొందారు.దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొన్న ఈ జాతీయస్థాయి సాంస్కృతిక వేడుకల్లో భారతీయ కళా వైభవం, సాంస్కృతిక వైవిధ్యం, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు 5,000 మంది కళాకారులు, 32కు పైగా నృత్య విభాగాలు పాల్గొనడం విశేషం.ఆంధ్రప్రదేశ్ నుంచి 92 మంది కూచిపూడి నృత్య కళాకారులు పాల్గొనేందుకు ముందుకు రాగా, నిర్వహించిన కఠినమైన అడిషన్స్ అనంతరం రాష్ట్రం నుంచి 71 మంది కళాకారులు తుది ప్రదర్శనకు ఎంపికయ్యారు. వీరిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన నాట్యాచారిణి, శ్రీ సాయి నటరాజ కళాపీఠం గురువు కొల్లేపర ఫణిన్మయి చోటు దక్కించుకోవడం విశేషం.

ఈ ప్రతిష్ఠాత్మక నృత్య ప్రదర్శన కోసం కళాకారులకు పది రోజులపాటు ప్రతిరోజూ సుమారు 16 గంటల చొప్పున కఠినమైన నృత్య సాధన నిర్వహించారు.

ఇందిరమ్మ ఇండ్లలో దీపావళి పండుగ సంబరాల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న

రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి


ప్రజా ప్రభుత్వ పాలన లో రాష్ట్రం అంతా దీపావళి ఇందిరమ్మ ఇళ్లలో అపూర్వ సంబురాలు జరుగుతున్నాయని రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలం లోని కోరట్లగూడెం లో ఆదివారం నిర్వహించిన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబురాలలో మంత్రి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్దకు వెళ్లి యోగ,క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో సెల్ఫీ ఫోటోలు దిగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం.ఆత్మగౌరవమే ధ్యేయంగా ప్రభుత్వం. అడుగులు వేస్తుందని అన్నారు.మొదటి విడతలో రాష్ట్రంలో 4.5 లక్షలఇళ్లు.రెండో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్లు అదనంగా హైద్రాబాద్ లో మరో లక్ష ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లు ను రూ.40 వేల కోట్ల నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి విడత లో 2.21 లక్షలు ఇళ్లు గృహా ప్రవేశాలు పూర్తి చేసినట్లు తెలిపారు.అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు మూడో,నాలుగు విడతలు గా అందిస్తామని భరోసా ఇచ్చారు.లబ్ధిదారులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీ.ఎస్.,సీపీ సునీల్త్,అదనపు కలెక్టర్.శ్రీనివాసరెడ్డి,గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్,సర్పంచ్ త్రివేణి,జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు,కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు,నెల్లూరి భద్రయ్య,బోయిన వేణు, కట్టెకోల నాగార్జున,కోర్లకుంట్ల నాగేశ్వరరావు, చెరుకుపల్లి రాజేష్,కొమ్మూరి నరేష్, పసుపులేటి ఉపేందర్,



కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.చెరుకు కు బోనస్ ఇవ్వాలి...మంత్రిని కలిసిన రైతులు. చెరుకు రైతులకు ధాన్యం కు తరహా లోనే చెరుకు కు బోనస్ ఇవ్వాలని రైతులు మంత్రిని కలిసి వినతి ప్రతం ను అందించారు. రాజేశ్వరపురం వద్ద రైతులు కలిసి సమస్య ను వివరించారు. ఇతర రాష్ట్రాల తరహాలోనే టన్నుకు రూ.700 చెల్లించాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.సర్పంచ్లు దండా రంగయ్య,ఏలూరి రామారావు,చింతనిప్పు సైదులు,రచ్చా నరసింహారావు, పుసులూరి వాసు,తాళ్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయతల నడుమ దీపావళి సంబరాలు

కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహంగా వేడుకలు





నేలకొండపల్లి

మండలంలోని ముఠాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావెళ్ల కృష్ణారావు నివాసంలో ఆదివారం దీపావళి పండుగ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.ముఖ్యంగా ఆయన కుమార్తె లండన్ నుంచి స్వదేశానికి రావడంతో కుటుంబంలో పండుగ ఆనందం రెట్టింపైంది.చాలాకాలం తర్వాత కుమార్తెతో కలిసి దీపావళి జరుపుకునే అవకాశం రావడంతో రావెళ్ల కృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో సంతోషంగా వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరూ ఒకచోట చేరి దీపాలు వెలిగించి,టపాసులు కాల్చి,పరస్పరం దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.మండల పరిధిలోని కోరట్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు కుటుంబ సభ్యులతో

కుటుంబ బంధాలు, ఆప్యాయతలు, అనుబంధాలకు ప్రతీకగా నిలిచే పండుగను కుటుంబ సభ్యులతో దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి పరస్పర దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ ఏడాది తమ కుటుంబానికి మరపురాని అనుభూతిని మిగిల్చిందని వారి ఆనందం వెల్లివిరిసింది. కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని గడపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రైతుల ధాన్యం కొంటారా .మిల్లు కు తాళాలు వేయమంటరా

- రాజేశ్వరపురం మిల్లు వద్ద ఉద్రిక్తత...
-మిల్లు కు తాళాలు వేసి...ధర్నా కు దిగిన రైతులు



నేలకొండపల్లి

మండలం లోని రాజేశ్వరపురం వద్ద ఉన్న అరుణచలం రైస్ మిల్లు వద్ద ఆదివారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.ధాన్యం కొంటారా...మిల్లుకు తాళాలు వేయమంటరా అని రైతులు నిరసన కు దిగారు.బీపీటీ తప్ప...ఏ ధాన్యం ను కూడ కొనుగోలు చేయకపోవటంతో రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మోటాపురం,చెన్నారం, రాజేశ్వరపురం, అమ్మగూడెం,జక్కేపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన కు దిగారు.మిల్లర్ల కు రైతుల మధ్య వివాదం చోటు చేసుకుంది.ఆరుపులు,కేకల మధ్య ఉద్రికత్త చోటు చేసుకుంది.విషయం తెలుసుకున్న పోలీసులు మిల్లు వద్ద కు చేరుకున్నారు.తొలుత మిల్లర్ల తో రైతులు చర్చించినప్పటికీ వినకులడా.రైతులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారు.దీంతో ఆగ్రహించిన రైతులు మిల్లు ప్రధాన గేటుకు తాళాలు వేశారు.గేటు వద్ద దర్నాకు దిగారు.ఈ ప్రాంతంలో రైతులు పండించిన అన్ని రకాల ధాన్యం ను కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.కొంటే అన్ని రకాల ధాన్యం ను కొనుగోలు చేయాలని లేకుంటే మిల్లు మూసువేయాలన్నారు. లేకుంటే తామే మిల్లు కు తాళాలు వేస్తామని హెచ్చరించారు.సోమవారం మిల్లు బాధ్యులు వచ్చాక సమస్య పై చర్చిస్తామని నిర్వాహకులు చెప్పటంతో రైతులు ఆందోళన విరమింపచేశారు.ఈ కార్యక్రమంలోరైతు ప్రతినిధులు సర్పంచ్ లు దండా రంగయ్య,ఏలూరి రామారావు,రచ్చా నరసింహారావు,పుసులూరి వాసు,చింతనిప్పు సాయిదులు,తాళ్లూరి రవి,ఇంటూరి ఆశోక్,రామారావు,యలమద్ది లెనిన్,దండా నరసింహారావు, హనుమంత్,పి వీరయ్య రామస్వామి ఉన్నారు.

నేటి బాలలే దేశ భవిష్యత్తు...

ఏయంవో ప్రభాకర్ రెడ్డి



నేలకొండపల్లి

నేటి బాలలే దేశ భవిష్యత్ అని ఏయంవో పి. ప్రభాకర్ రెడ్డి అన్నారు.బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పీఎంఆర్ మోమెరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల స్థాయిలో సోమవారం సాంస్కృతిక కార్యక్రమ పోటీలు నిర్వహించారు. మండలం లోని పలు ప్రభుత్వ,ప్రవేట్ పాఠశాల లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆటా, పాటలతో సందడి చేశారు.అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ మొదటి ప్రధాని నేహ్రూ పిల్లల పట్ల చూపిన ప్రేమ, వారి భవిష్యత్ పట్ల ఆయన కున్న ఆకాంక్షే బాలల దినోత్సవం అన్నారు.పిల్లలు చదువుతో పాటుక్రమశిక్షణ,నైతిక విలువలు అలవర్చుకుని దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు.ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలుగులోకి వచ్చింది. బి.చలపతిరావు.పీఎంఆర్ మోమెరియల్ ట్రస్టు ప్రతినిధులు మరియ ప్రసాద్,ప్రగతి.వివిధ ఉపాధ్యాయ సంఘాలుప్రతినిధులు తొర్తి సురేష్, ఎస్.నాగార్జున,తొర్తి గురవయ్య,నందిగామఆనంద్,రమేష్ ఉన్నారు.

కుర్రారం గ్రామంలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.....



రాజాపేట,

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా కుర్రారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు ఆదివారం పాండవుల బసవరాజు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో మాజీ కోపరేటివ్ డైరెక్టర్ కత్తుల అంజి రెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, నీల నరసయ్య, మాజీ సర్పంచ్ బూరుగు రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బాల్ద చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు నంద నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రగుంట ప్రభాకర్(వార్డు సభ్యులు), కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల బాలయ్య, వల్లూరి సంజీవ, తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, రేకులపల్లి రామ్ రెడ్డి , సోమిడి సోమిరెడ్డి బుస్సా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ ముందు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాండవుల బసవరాజ్ గౌడ్ మాట్లాడుతూ మరో 20 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే అందుకు బాటలు వేస్తాయని అన్నారు.

బసంతపురం లో దీపావళి వేడుకలు జరుపుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య.....



రాజాపేట,

ప్రభుత్వం చేపట్టిన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పండుగ కార్యక్రమం సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాజాపేట మండలం బసంతాపురం గ్రామంలో సంబరాల్లో పాల్గొన్నారు. సంగం లక్ష్మణ్ రమ దంపతుల ఇందిరమ్మ ఇంట్లో ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ప్రభుత్వ బీర్ల ఐలయ్యకు ఎం డి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో డప్పు చప్పులతో ఘనంగా స్వాగతం పలికారు. ఇందిరమ్మ ఇంటిముందు ప్రత్యేక పూజలు చేసి బీర్ల ఫౌండేషన్ ద్వారా పట్టుబట్టలు, స్వీట్లు బాణాసంచా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేశారు. ఇంటి ముందు లక్ష్మణ్ రమ కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులతో కలిసి బాణాసంచా కాలుస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం తర్వాత బీర్ల ఐలయ్య స్వయంగా టీ తయారుచేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమానికి వచ్చిన బీర్ల ఐలయ్యకు కుటుంబ సభ్యులు సన్మానం చేసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కూతల నాగవేణి, ఎస్సై తక్కియొద్దీన్, హౌసింగ్ ఏఈ వేముల వివేకానంద గౌడ్, సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి, ఎం బి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇంజ నరేష్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్, సర్పంచులు నమిల పులి రాజు ముదిరాజ్, జాల సర్పంచ్ గంధ మల్ల నవనీత నర్సింలు, గొలుసుల అనూష యాకూబ్ , ఉప్పరి నరేష్, మదర్ డైరీ డైరెక్టర్ గొల్లపల్లి రామ్ రెడ్డి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, మాలోత్ విఠల్ నాయక్, రాజాపేట డాక్టర్ చింతల రవి, బసంతాపురం గ్రామ శాఖ అధ్యక్షులు మెండు ఉపేందర్ రెడ్డి, రాజాపేట ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, చల్లూరు ఉపసర్పంచి బొంత సుధాకర్, రేగు సిద్ధులు అంకతి బాలయ్య కాలే సుమలత నర్సెట్టి కనకయ్య కొండ్రెడ్డి చెరువు సర్పంచ్ నరేష్, సింగారం అధ్యక్షులు గుర్రాల నరేష్, కాల్వపల్లి ఉపసర్పంచ్ కళ్లెం పాండు, కుర్రారం అధ్యక్షులు ఎర్రగుంట సునీల్, కాల్వపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి వాకిటి భాను, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పిట్టల జయరాములు, బసంతాపురం వెంకటేష్, మెండు పద్మా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నియోజకవర్గస్థాయిలోనే బసంతపురం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించిన ఎం బి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డిని బీర్ల ఐలయ్య అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.మెండు మధుసూదన్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి ఉపసర్పంచ్ గొల్లపల్లి రాజు గౌడ్, గంధ మల్ల బాలకృష్ణ గౌడ్, ములకల రమేష్, మెండు సాయి రెడ్డి వడ్లకొండ మహేష్ బాబు, గొల్లపల్లి వినయ్ గౌడ్ కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర అధ్యక్షులు మెండు భాస్కర్ రెడ్డి గ్రామ ప్రజలు గ్రామ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చెరుకు టన్ను రూ.4,200 ఇవ్వాల్సిందే..!

చెరుకు రైతుల ధర్నా



నేలకొండపల్లి

చెరుకు టన్నుకు రూ.4,200 వేల ధర ను చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.మండలం లోని రాజేశ్వరపురం వద్ద ఆదివారం చెరుకు రైతులు ధర్నా నిర్వహించారు.పెరిగిన పెట్టుబడి,కూలీల ఖర్చుల ను రైతులు భరించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.మధుకాన్ యాజమాన్యం ప్రకటించిన రూ.3,800 కాకుండా కనీసం టన్నుకు రూ.4,200 వేలు లేకుంటే చెరుకు సరఫరా చేయలేమని పేర్కొన్నారు. యాజమాన్యం పరిస్థితులను అర్థం చేసుకుని చెరకు గిట్టు బాటు ధర ను ప్రకటించాలని కోరారు.యాజమాన్యం మరోమారు రైతుల తో సమావేశం ను నిర్వహించాలని కోరారు.లేకంటే చెరుకు రైతులు ఉద్యమం ను చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు సర్పంచ్ లు దండా రంగయ్య,ఏలూరి రామారావు,రచ్చా నరసింహారావు,పుసులూరి వాసు,చింతనిప్పు సైదులు,తాళ్లూరి రవి,ఇంటూరి ఆశోక్,చాగంటి మధు,మస్తాన్, రామారావు,యలమద్ది లెనిన్, హనుమంత్,పీ.వీరయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజపేట ఎంపీఓగా దంతూరి వెంకటేష్



రాజపేట రాజపేట ఎంపీఓగా సోమ వారం దంతూరి వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగవేణి, సూపరిండెంట్ అల్లం ఇన్నారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది శాలువలతో సత్కరించి స్వాగతం పలికారు. తుర్కపల్లి ఎంపీవో వెంకటేష్ కు రాజాపేట ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

యూపీలో మంటల్లో చిక్కుకున్న కారు

.. చిన్నారి సహా ఆరుగురు సజీవదహనం



ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు(కరెంట్ పోల్‌ను ఢీకొట్టి మంటలు చెలరేగడంతో ఓ చిన్నారి సహా ఆరుగురు సజీవ దహనమయ్యారు. ఈ విషాదకర సంఘటన ముజఫర్‌నగర్ జిల్లాలోని పానిపట్-ఖతిమా జాతీయ రహదారి జగహేరి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం అతివేగంగా వస్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న వేగంగా దూసుకెళు ్తన్న కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని, డివైడర్‌ను బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో భారీగా మంటలు చెలరేగాయి. తప్పించుకునే అవకాశం లేకపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఒక చిన్నారి సహా ఆరుగురు వ్యక్తులు కారులోనే చిక్కుకుపోయి సజీవదహనమయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కారులోని మృతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.ప్రాథమిక సమాచారం ప్రకారం మృతులంతా హర్యానాలోని జింద్ లేదా హిసార్ జిల్లాకు చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వీరంతా కారులో హర్యానా నుండి హరిద్వార్‌కు ప్రయాణిస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. మృతుల్లో 10 నుండి 12 సంవత్సరాల మధ్య వయస్సు గల ఒక బాలుడు కూడా ఉన్నాడని అధికారులు తెలిపారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఐపీఎల్ 2026 సూపర్ స్ట్రయికర్..

కొత్త కారు అందుకున్న వైభవ్ సూర్యవంశీ



పాట్నా: బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీతన ఆటశైలితో అందర్నీ ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్.. సూపర్ స్ట్రయికర్ అవార్డును గెలుచుకున్నాడు. దానిలో భాగంగా అతనికి ఓ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు. 15 ఏళ్ల బీహారీ బ్యాటర్.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇండియా జట్టుతోనూ బీజీగా ఉన్న వైభవ్.. దీపావేళి వేళ కొత్త కారును అందుకున్నారు. సూపర్ స్ట్రయికర్ అవార్డు కింద అతనికి టాటా సియార్రా ఎస్‌యూవీ అందజేశారు. ఫ్యామిలీతో కలిసి టాటా షోరూమ్ వెళ్లిన అతను ఆ కారును స్వీకరించాడు.పసుపు రంగు టాటా కారును వైభవ్ తీసుకున్నాడు. పేరెంట్స్, సోదరులతో కలిసి అతను ఆ కారను అందుకున్నాడు. వాస్తవానికి వైభవ్ గ్యారేజీలో గిఫ్ట్‌గా వచ్చిన చాలా కార్లు ఉన్నాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో కూడా సూపర్ స్ట్రయికర్ అవార్డు కింద వైభవ్ కు టాటా కర్వ్ ఈవీ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు. 2026 ఐపీఎల్ సీజన్‌లో వైభవ్ 16 మ్యాచుల్లో 776 రన్స్ చేశాడు. ఆ టోర్నీ లో అతను 63 ఫోర్లు, 72 సిక్సర్లు బాదాడు. ఆరెంజ్ క్యాప్ గెలిచాడతను.

బాణాసంచా పేల్చితే.. అనేక వ్యాధులు దూరం : బీజేపీ ఎమ్మెల్యే



కోల్‌కతా : పటాకులు పేల్చ డం వల్ల అనేక వ్యాధు లు నయం అవుతాయని బీజేపీ ఎమ్మెల్యే పాపియా అధికారి అన్నారు. బెంగాల్ లోని టొల్లింగజి ఎమ్మెల్యే అయిన ఆమె.. తమ నియోజకవ ర్గంలో జరిగిన కాళీ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఆ ఎమ్మెల్యే ప్రసంగం చేస్తున్న సమయంలో.. కొన్ని పటాకులు పేలాయి. ఆ సందర్భంలో ఆమె మాట్లాడుతూ బాణాసంచా పేల్చడం వల్ల అనేక వ్యాధులు దూరం అవుతాయని అన్నారు.పటాకులు పేల్చుకోవచ్చు అని సీఎం తెలిపారని, బాణాసంచా పేల్చకుండా కాళీ పూజ పూర్తి కాదు అని, తప్పకుండా ఫైర్‌క్రాకర్స్ పేల్చుతామని, కానీ పోలీసుల మార్గదర్శకాల ప్రకారం ఆ పటాకుల పేలుళ్లు ఉంటాయని ఎమ్మెల్యే పాపియా అధికారి అన్నారు. అయితే బెంగాల్ సీఎం సువేందు అధికారి ఇటీవల కాళీ పూజ పందిళ్లను ప్రారంభించిన నేపథ్యంలో మాట్లాడుతూ.. ఎకో ఫ్రెండ్లీ, గ్రీన్ క్రాకర్స్ కాల్చాలని ఆయన అన్నారు. భారీ శబ్దాలు వచ్చే పటాకులు పేల్చవద్దు అన్నారు. శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

సాగు, తాగు నీరందకుండా చేసిన దుర్మార్గుడు రేవంత్ రెడ్డి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



కేసీఆర్‌పై కక్ష సాధింపు కోసం నీళ్లు ఎత్తిపోయకుండా తెలంగాణకు కరువు తెచ్చిన దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మండిపడ్డారు.
తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను మొన్న సందర్శించినప్పుడు మేడిగడ్డ దగ్గర దాదాపు 21 వేల క్యూసెక్కుల నీరు వృధాగా పోతుంది.. దాదాపు 2 టీఎంసీల నీళ్లు పోతున్నయి.. ఎత్తిపోసుకునే అవకాశముంది.. మేడిగడ్డ బ్యారేజ్‌కు కన్నెపల్లికి దాదాపు 8 కిలోమీటర్ల దూరం ఉంది.. కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర ఎలాంటి ఇబ్బంది లేదు.. మేడిగడ్డ దగ్గర క్రాక్ అయింది.. కానీ అన్నారం, సుందిళ్ల బాగున్నాయని గతంలో ఎన్డీఎస్ఏ కూడా మాకు సర్టిఫికెట్ ఇచ్చింది.. అలాగే సీడబ్ల్యూపీఆర్ఎస్ అనే సంస్థ కూడా వాళ్లకు క్లీన్ చీట్ ఇచ్చిందన్నారు.
ఆ 2 బ్యారేజ్‌లకు అన్నారం, సుందిళ్లకు ఎటువంటి ప్రాబ్లమ్ లేదు.. మీరు ఎత్తిపోసుకోవచ్చని కూడా స్పష్టం చెప్పడం జరిగింది.. ఎన్డీఎస్ఏ కూడా కోర్టుకు ఏదైతే అఫిడవిట్ దాఖలు చేశారో స్పష్టంగా ఏం చెప్పారంటే మేం టెక్నికల్‌గా రిపోర్ట్ ఇవ్వగలుగుతం. నింపి ఎత్తిపోసుకునేది మీ ఇష్టం అని చెప్పిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు.మనకు ఉదాహరణలు కూడా ఉన్నాయి.. ఈ సంవత్సరం ఆగస్టు 1న 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు ఇదే మేడిగడ్డ నుంచి ప్రవాహం చేసి కిందికి పోయి సముద్రగర్భంలో కలిసినయి. పోయిన సంవత్సరం కూడా ఇంచుమించు 10-11 లక్షల క్యూసెక్కులు అదే మేడిగడ్డ 2025., 2026లో బ్యారేజ్ నుంచి పోయాయి.మరి 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు తట్టుకునే కెపాసిటీ మేడిగడ్డ దగ్గరున్నపుడు.. కేవలం ఎన్టీఎస్ఏ చెప్పింది..అక్కడ క్రాక్ వచ్చిందని కారణంగా చూపెట్టి నీళ్లు ఎత్తిపోయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఎండిపెట్టినవ్. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయాన్ని కానీ, తాగునీరు కానీ అందరికీ అందకుండా చేసిన దుర్మార్గుడివి నీవని ఫైర్ అయ్యారు.

పండుగ పూట హైదరాబాద్‌లో వరుస అగ్నిప్రమాదాలు..!



దీపావళి పండుగ(వేళ హైదరాబాద్‌లోనిపలు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు ప్రజలను కంటిమీద కునుకు చేలుకుండా చేశాయి. అసలే పటాకుల మోతతో హోరెత్తిపోతుంటే మరోవైపు ఎప్పుడు ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయంతో వణికిపోయారు.ఈ ప్రమాదాల కారణంగా ప్రాణ నష్టం లేకపోయినప్పటికీ రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. బేగంబజార్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లో ఈ ప్రమాదాలు జరిగాయి. సికింద్రాబాద్ పరిధిలోని సీతాఫల్‌మండిలో దీపావళికి అంటించిన ఓ రాకెట్ బాణసంచా దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా షాపులోని క్రాకర్స్ అన్నీ పేలి, మంటలు భారీగా ఎగసిపడ్డాయి. మంటలు రావడంతో జనాలు, వాహనాలు భయంతో పరు గులు పెట్టారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.కాటేదాన్‌లో ఓ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. క్షణాల్లో పక్కనే ఉన్న ప్లైవుడ్ పరిశ్రమకు మంటలు వ్యాపించాయి. దట్టంగా వ్యాపించిన నల్లటి పొగతో స్థానికులు ఉక్కిరిబి క్కిరి అయ్యారు. ఒక్కసా రిగా భయభ్రాం తులకు గురై ఇళ్లల్లో నుంచి బయటికి పరుగులు తీశారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలు ఆర్పారు. భారీగా ఆస్తి నష్టం జరుగా పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు తెలిపారు. అలాగే కూకట్‌పల్లిలోని ఆస్బెస్టాస్ కాలనీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పేపర్ టీ కప్పులు, ప్లేట్స్ తయారీ కంపెనీలో సోమవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. దీంతో నెయ్యి, కుర్‌కురే, హల్దీరామ్ స్టాక్ గోదాములకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

దీపావళి ఎఫెక్ట్.. ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం

దీపావళి ఫెస్టివల్ తర్వాత దేశ రాజధాని ఢిల్లీనికమ్మేసింది. ఆదివారం రాత్రి ప్రజలు భారీగా పటాకులుకాల్చడంతో గాలి నాణ్యత మరింత దిగజారింది. రాత్రి 7 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ)371కి చేరింది. దీంతో గాలి నాణ్యత 'వెరీ పూర్' కేటగిరీలో నమోదయినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. నగరంలోని మొత్తం 59 కాలుష్య పర్యవేక్షణ కేంద్రాల్లో 19 చోట్ల ఏక్యూఐ 'సీవియర్' స్థాయికి చేరింది. మరో ఏడు కేంద్రాల్లో 'పూర్', మిగిలిన 33 కేంద్రాల్లో 'వెరీ పూర్' స్థాయిలో నమోదైంది. జహంగీర్‌పురిలో అత్యధికంగా 460 ఏక్యూఐ నమోదైంది. ఆదివారం ఢిల్లీ సగటు ఏక్యూఐ 376గా నమోదైంది.
కాగా, నగరంలో శీతాకాలంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఢిల్లీ ప్రభుత్వం నవంబర్ 6 నుంచి ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) మూడో దశను అమల్లోకి తెచ్చింది. ఏక్యూఐ 401-500 మధ్య నమోదైనప్పుడు ఈ దశను అమలు చేస్తారు. ఇందులో భాగంగా నిర్మాణ, కూల్చివేత పనులపై నిషేధం విధించారు. బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ నాలుగు చక్రాల వాహనాల రాకపోకలపైనా ఆంక్షలు విధించారు. ప్రజలు నిబంధనలు పాటించి వాయి కాలుష్యం తగ్గించాలని అధికారులు సూచించారు.



కోర్టులో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిటిషన్.. కీలక పరిణామం



గుంటూరు: జైల్లో ప్రత్యేక ఫుడ్డుతో పాటు ప్రత్యేక కేటగిరీ కింద కల్పించాల్సిన సదుపాయాలన్నీ కల్పించాలంటూ గుంటూరు కోర్టులో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన గుంటూరు కోర్టు లేళ్ల అప్పిరెడ్డికి ప్రత్యేక ఫుడ్ తోపాటు ప్రత్యేక కేటగిరీ కింద కల్పించాల్సిన సౌకర్యాలు అన్నీ కల్పించాలని జైలు అధికారులను ఆదేశించింది.అయితే, తమ జైల్లో ఈ సదుపాయాలు లేవని, తాము ప్రత్యేక సదుపాయాలు కల్పించలేదని కోర్టుకు జైలు అధికారులు తెలిపారు. దానితోపాటు భద్రత కూడా కల్పించలేమని, వేరే జైలుకు తరలించాలని కోర్టులో గుంటూరు జైలు అధికారులు పిటిషన్ వేశారు. దీంతో లిఖితపూర్వకంగా వాదనలు దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది.
కాగా, స్థానిక ఎన్నికల వేళ ఇటీవల ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని పోలీసులు అక్రమ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బ్యాలెట్ బాక్సును మార్చేయడానికి యత్నించిన దుశ్చర్యపై పూర్తి విచారణ జరిపి, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా ఉన్నతాధికారులు, ఎస్ఈసీ.. ఆ పనిచేయకపోగా ఆ తప్పును కప్పిపుచ్చేందుకు ప్రయత్నాలు జరిపారు. శాంతియుతంగా ధర్నా చేసిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ప్రత్తిపాడు పరిశీలకుడు గులాం రసూల్‌తోపాటు, మరో 17 మందిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అక్రమ కేసు నమోదు చేసి అక్రమంగా అరెస్టు చేయడం పోలీసులు ఏ స్థాయిలో అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారో తేటతెల్లం చేస్తోంది.



హోమ్‌లోన్ లేకుండానే రూ.70 లక్షల ఇల్లు.

సొంతిల్లు అనేది ప్రతి మధ్య తరగతి వ్యక్తికీ జీవితకాల కల. అది అందరికీ అంత సులువు కాదు. ఇల్లు కొనాలంటే భారీగా డౌన్‌పేమెంట్ చెల్లించాలి.. మిగిలిన మొత్తానికి హోమ్‌లోన్ తీసుకోవాలి. ఆ తర్వాత నెలల తరబడి ఈఎంఐలు కట్టాలి. అయితే మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ మాత్రం ఇందుకు భిన్నంగా ఆలోచించింది. క్రమశిక్షణతో కూడిన పొదుపు, అదనపు ఆదాయంతో ఎలాంటి హోమ్ లోన్ తీసుకోకుండానే సుమారు రూ.70 లక్షల విలువైన ఇంటిని కొనుగోలు చేసి, తనకు నచ్చినట్లు అలంకరించుకుంది. ప్రస్తుతం ఈమె ఇంటి కొనుగోలు ప్రయాణం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

మూడేళ్లలో రూ.19 లక్షల పొదుపు

మహారాష్ట్రలోని షహాద్‌కు చెందిన ఈ మహిళ సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియో ప్రకారం.. ఆమె కొనుగోలు చేసిన ఫ్లాట్ విలువ రూ.60 లక్షలు. ఇంటీరియర్ పనులతో కలిపి మొత్తం ఖర్చు దాదాపు రూ.70 లక్షలకు చేరింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మూడేళ్ల పాటు ప్రణాళికాబద్ధంగా డబ్బు ఆదా చేసింది. మొదటి ఏడాది రూ.4 లక్షలు, రెండో ఏడాది రూ.5.5 లక్షలు, మూడో ఏడాది రూ.9.5 లక్షలు.. ఇలా మొత్తం రూ.19 లక్షలు పొదుపు చేసింది. వీటితో పాటు రూ.లక్ష అత్యవసర నిధిని కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంది.


రెండు బ్యాంకు ఖాతాల వ్యూహం

పొదుపు కోసం ఆమె అనుసరించిన విధానం ఆసక్తికరంగా ఉంది. తన లాగే ప్రతి ఒక్కరూ రెండు బ్యాంకు ఖాతాలు తెరవాలని సూచించింది. ఒకటి జీతం జమయ్యే ఖాతా కాగా, మరొకటి కలల ఇంటి కోసం కేటాయించిన ప్రత్యేక ఖాతా. జీతం అందిన వెంటనే అందులో ఎక్కువ మొత్తాన్ని రెండో ఖాతాకు బదిలీ చేసేది. అనవసర ఖర్చుల కోసం ఆ డబ్బును విత్‌డ్రా చేయకుండా డెబిట్, క్రెడిట్ కార్డులకు దూరంగా ఉంచింది.

బిల్డర్‌తో ఒప్పందమే కీలకం

మొదట మిగిలిన మొత్తానికి గృహ రుణం తీసుకోవాలని భావించినప్పటికీ, తండ్రితో చర్చించిన తర్వాత మరో మార్గాన్ని ఎంచుకుంది. నిర్మాణంలో ఉన్న ఫ్లాట్ కావడంతో బిల్డర్‌తో నేరుగా వాయిదాల పద్ధతిలో చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. నెలకు రూ.లక్ష చొప్పున 36 నెలల పాటు చెల్లించి, మిగిలిన రూ.8 లక్షలను ఇంటి స్వాధీన సమయంలో చెల్లించేలా మాట్లాడుకుంది.

బంగారం ధరలు మళ్లీ పెరిగాయ్..



కొనుగోలుదారులకు బంగారం ధరలు షాక్ ఇచ్చాయి. కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులకు గురైన ధరలు నేడు (సోమవారం) మళ్లీ పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల సమయానికి నిన్నటి ధరలతో పోలిస్తే ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,150 పెరిగి రూ.1,44,750కి చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.950 పెరిగి రూ.1,32,700గా నమోదైంది. ఇక ముంబైలో నిన్నటి ధరలతో పోలిస్తే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,030 పెరిగి రూ.1,44,600కి చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.950 పెరిగి రూ.1,32,550 వద్ద కొనసాగుతోంది.

వాట్సాప్‌లో కొత్త ఫీచర్.. బ్లూ టిక్స్ పడకుండానే మెసేజ్‌లు చ

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,030 పెరిగి రూ.1,44,600గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.950 పెరిగి రూ.1,32,550కి చేరుకుంది. వెండి ధరల విషయానికి వస్తే.. ఢిల్లీ, ముంబైలో కిలో వెండి ధర రూ.2,05,000 వద్ద ట్రేడవుతోంది.

రోజూ కొన్ని బాదంపప్పులను తినడం వల్ల శరీరంలో జరిగే మార్పులు ఇవే.

అధ్యయనాల్లో తేలిన నిజాలు..



రోజూ కొన్ని బాదంపప్పులు తినడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయని జీర్ణకోశ నిపుణులు చెబుతున్నారు. పోషకాలు సమృద్ధిగా ఉండే బాదంపప్పులను సులభంగా వెంట తీసుకెళ్లవచ్చు. సమయం తక్కువగా ఉన్నప్పుడు మంచి చిరుతిండిగా కూడా వీటిని తీసుకోవచ్చు. బాదంపప్పులను క్రమం తప్పకుండా తింటే శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచ సుకుంటాయో వైద్య నిపుణులు వివరించారు.

కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

బాదంపప్పులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఒక విశ్లేషణ ప్రకారం.. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) స్థాయిలు ప్రతి డెసిలీటర్‌కు సుమారు 5 మిల్లీగ్రాముల మేర తగ్గినట్లు గుర్తించారు. అలాగే సుమారు 23 బాదంపప్పులు తింటే దాదాపు 4 గ్రాముల పీచు పదార్థం లభిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారంతోపాటు బాదంపప్పులు తీసుకుంటే భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా సహాయపడతాయి. ఒక గుప్పెడు బాదంపప్పుల ద్వారా సుమారు 6 గ్రాముల మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. ఇవి ఎక్కువసేపు ఆకలి వేయకుండా కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. చర్మ ఆరోగ్యానికి కూడా ఇవి ఉపయోగపడతాయని ఒక అధ్యయనం సూచించింది. శాతం తగ్గినట్లు ఆ అధ్యయనంలో గుర్తించారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు అవసరం..

బాదంపప్పులతోపాటు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మరికొన్ని అలవాట్లను కూడా నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం నిద్రలేవగానే ఫోన్ చూడకుండా, కృతజ్ఞతగా భావించే విషయాలను కొద్దిసేపు గుర్తుచేసుకోవాలని చెబుతున్నారు. ఉదయం సుమారు 10 నిమిషాల పాటు సూర్యరశ్మిలో గడపడం వల్ల మానసిక స్థితి మెరుగుపడటంతోపాటు విటమిన్ డి స్థాయిలకు, శరీర జీవగడియారానికి మేలు కలుగుతుంది. భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నడవడం జీర్ణక్రియకు సహాయపడుతుంది. పెరుగు, కేఫీర్, కిమ్చీ వంటి ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల పేగుల్లో మేలు చేసే సూక్ష్మజీవుల పెరుగుదలకు తోడ్పడుతుంది. పసుపు, అల్లం, జీలకర్ర, సోంపు వంటి సుగంధ ద్రవ్యాలను ఆహారంలో చేర్చుకోవడం కూడా జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. భోజనాల మధ్య విరామం ఉండాలి..రోజులో మొదటి భోజనం నుంచి చివరి భోజనం వరకు 12 గంటల విరామం ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారుఅయితే, ప్రతి ఒక్కరి పోషక అవసరాలు ఒకేలా ఉండవు కాబట్టి ఆహారపు అలవాట్లను వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవడం ముఖ్యమని వారు సూచిస్తున్నారు.

రోజుకో బాయిల్డ్ ఎగ్ తింటే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు..

అవేంటో తెలుసా..?



మనం ఆహారంగా తీసుకునే ప్రతి పదార్థంలో ఆరోగ్యానికి మేలుచేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాల్లో ఎక్కువ ఆరోగ్య ప్రయోజానాలున్న పోషకాలుంటే.. కొన్ని రకాల ఆహార పదార్థాల్లో తక్కువ ఆరోగ్య ప్రయోజనాలున్న పోషకాలుంటాయి. ఇక అధిక ప్రయోజనంగల పోషకాలున్న ఆహార పదార్థాల విషయానికి వస్తే.. కోడిగుడ్డు ముందు వరుసలో ఉంటుంది. మనం రోజుకొక ఉడుకబెట్టిన కోడిగుడ్డు తింటే ఆరోగ్యపరంగా ఎన్నో లాభాలుంటాయి. మరి అవేంటో తెలుసుకుందామా..

ప్రయోజనాలు..

1. కోడిగుడ్లు ద్వారా శరీరానికి రకరకాల పోషకాలు లభిస్తాయి. శరీరానికి కావాల్సిన సాచురేటెడ్ ఫ్యాట్స్, పాలీ అన్ సాచురేటెడ్ ఫ్యాట్స్, మోనో అన్ సాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. అదేవిధంగా పొటాషియం, విటమిన్-ఎ, కాల్షియం, ఐరన్, విటమిన్-ఇ, విటమిన్ డీ6, విటమిన్ డీ12, మెగ్నీషియం గుడ్డులో పుష్కలంగా లభిస్తాయి.

2. కోడిగుడ్డు మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. గుడ్డు సొనలో ఉండే కోలిన్ అనే పోషక పదార్థం మెదడు కణాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

3. కోడిగుడ్డులోని ఐరన్‌ను శరీరం వేగంగా గ్రహిస్తుంది. ఈ ఐరన్ గర్భిణులు, బాలింతలకు బాగా ఉపయోగపడుతుంది. కాబట్టి గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు ఉడుకబెట్టిన కోడిగుడ్డు తీసుకోవాలి.

4. గుడ్డులో ఉండే పోషక విలువలవల్ల ఇది మహిళల్లో రొమ్ము కాన్సర్ రాకుండా నిరోధించడంలో కూడా తోడ్పడుతుంది.

5. జుట్టు, గోర్లు ఆరోగ్యంగా ఉండేందుకూ గుడ్డు ఉపయోగపడుతుంది. గుడ్డులోని విటమిన్-ఎ కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతుంది.

6. గుడ్డులో పొటాషియం, కాల్షియం పుష్కలంగా ఉండటంవల్ల అవి ఎముకలు గట్టిపడటానికి తోడ్పడుతాయి.

. నరాల బలహీనత ఉన్నవారు కూడా ప్రతిరోజూ క్రమం తప్పకుండా గుడ్డును తీసుకోవడంవల్ల ప్రయోజనం ఉంటుంది. అంతేగాక గుండె రక్తనాళాలకు కూడా కోడిగుడ్డుతో మేలు కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

మహిళలు రోజూ ఎంత మొత్తంలో ప్రోటీన్లను తీసుకోవాలి.. ఎలాంటి వ్యాయామాలు చేయాలి..?



కుటుంబ బాధ్యతలు, ఉద్యోగం, రోజువారీ పనులతో బిజీగా ఉండే మహిళలు చాలాసార్లు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. సంప్రదాయాలను పాటించడం, ఉపవాసాలు చేయడం, కుటుంబ సభ్యుల బాగోగులు చూసుకోవడంపై శ్రద్ధ చూపుతున్నప్పటికీ, తమకు అవసరమైన పోషకాహారం తీసుకోవడం, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మరిచిపోతుంటారు. తగినంత ప్రొటీన్ తీసుకోకపోవడం, రక్తహీనత, ఎముకల బలహీనత, గుండె జబ్బుల ముప్పు వంటి సమస్యలు భారతీయ మహిళల్లో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇతర దేశాల మహిళలతో పోలిస్తే కొన్ని ఆరోగ్య సమస్యలు భారతీయ మహిళల్లో చిన్న వయసులోనే మొదలవుతున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఎముకల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం..

మహిళలు చిన్న వయసు నుంచే ఎముకల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని వారు సూచించారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం, తగినంత ప్రొటీన్ లేకపోవడం, కండరాలకు బలం చేకూర్చే వ్యాయామాలు చేయకపోవడం వల్ల కాలక్రమేణా కండరాలు, ఎముకలు బలహీనపడతాయి. చిన్నతనం నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తే వయసు పెరిగిన తర్వాత కూడా చురుకుగా, స్వతంత్రంగా జీవించవచ్చు. భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు ఎంతో నియమంగా ఉపవాసాలు చేస్తారని, అదే క్రమశిక్షణను తమ ఆరోగ్యం కోసం కూడా పాటించాలని వారు చెబుతున్నారు.

భారతీయ మహిళల్లో బోలు ఎముకల వ్యాధి ఇతర మహిళలతో పోలిస్తే 10 నుంచి 20 ఏళ్ల ముందుగానే మొదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. అలాగే భారతీయ మహిళల్లో 57 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. గుండె జబ్బులు కూడా భారతీయ మహిళల్లో దాదాపు పదేళ్ల ముందుగానే వస్తున్నాయని, క్యాన్సర్ కంటే గుండె జబ్బుల వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని వివరించారు.

రెండు అలవాట్లు తప్పనిసరి..

మహిళలు ముఖ్యంగా రెండు అలవాట్లను తప్పనిసరిగా పాటించాలని నిపుణులు సూచించారు. మొదటిది రోజువారీ ఆహారంలో తగినంత ప్రొటీన్ తీసుకోవడం. రోజుకు సుమారు 80 గ్రాముల ప్రొటీన్ తీసుకోవాలని, కేవలం 30 గ్రాములతో సరిపెట్టుకోవద్దని వారు సూచించారు. భారతీయ ఇళ్లలో పప్పులు ప్రొటీన్‌కు సాధారణ వనరుగా ఉన్నప్పటికీ, వాటితోనే రోజువారీ అవసరాలు తీరవని వివరించారు.

ఇండస్ట్రీలోకి రాకముందే ముక్కుకు సర్జరీ చేయించుకున్నా..


ఆసక్తికర విషయాలు బయటపెట్టిన జాన్వీ కపూర్!



జీఅష్టజఱ ఖుజూశీశీతీ। బాలీవుడ్ అందాల తార, దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సినిమాల్లోకి రావడానికి ముందు తన తల్లి శ్రీదేవి పెట్టిన కండిషన్లు, ఆమె ఇచ్చిన సలహాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.అంతేకాదు .. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి ముందే తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు కూడా చెప్పుకొచ్చారు. తొలుత తాను సినిమాల్లోకి వస్తానంటే తల్లి శ్రీదేవి పెద్దగా ఆసక్తి చూపించలేదని, అయితే ఆ తర్వాత తన నిర్ణయానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జాన్వీ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జాన్వీ కపూర్ తన తల్లి శ్రీదేవితో ఉన్న అనుబంధం గురించి ఎప్పటికప్పుడు పలు సందర్భాల్లో మాట్లాడుతూనే ఉంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా తన కెరీర్‌కు సంబంధించి తల్లి ఇచ్చిన సలహాలను గుర్తు చేసుకున్నారు. తాను సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు ఆ విషయాన్ని మొదట శ్రీదేవికి చెప్పానని, అయితే ఆమె వెంటనే అంగీకరించలేదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం అంటే సాధారణ విషయం కాదని, ఈ రంగంలోకి వస్తే జీవితాంతం నటనకే అంకితం కావాల్సి ఉంటుందని తన తల్లి చెప్పినట్లు వెల్లడించారు. ఈ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, పూర్తి నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందని శ్రీదేవి తనకు వివరించినట్లు చెప్పారు. మొదట్లో తనపై తల్లికి అంతగా నమ్మకం ఉండేది కాదని కూడా జాన్వీ పేర్కొన్నారు.

సినిమా న్యూస్

అనన్య పాండే న్యూ ఫొటోస్.. అందమంటే ఇది





పండగ అంటేనే.. అది సంస్కృతి సాంప్రదాయాలతో ముడిపడి ఉంటుంది. ముఖ్యగా హిందూ పండగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దసరా, దీపావళీ, రాఖీ పౌర్ణిమ, సంక్రాంతి ఈ పండగలను అందరూ చాలా నిష్టతో చేస్తారు. మొన్న కృతి.. నేడు రకుల్.. పండగపూట ఆ బట్టలేంటి .. సిగ్గులేదాపండగ అంటేనే.. అది సంస్కృతి సాంప్రదాయాలతో ముడిపడి ఉంటుంది. ముఖ్యగా హిందూ పండగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దసరా, దీపావళీ, రాఖీ పౌర్ణిమ, సంక్రాంతి ఈ పండగలను అందరూ చాలా నిష్టతో చేస్తారు. ఆ పండగలకు సంబంధించి ఎవరు ఏ చిన్న తప్పు చేసినా వారిని నిర్మొహమాటంగా ఎండగడతారు. ఈమధ్యకాలంలో హిందూ పండగల సమయంలో బాలీవుడ్ నటీమణులు అనుసరిస్తున్న తీరుపై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. పండుగ ఏదైనా సరే హిందూ సంప్రదాయ వేడుకల వచ్చేసరికి హీరోయిన్లు కావాలనే గ్లామర్ హద్దులు దాటుతున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొన్న కృతి.. నేడు రకుల్. పండగపూట ఆ బట్టలేంటి .. సిగ్గులేదా

వివాదాలను ఎదుర్కొన్న విషయం తెల్సిందే. బ్రాండ్ ప్రమోషన్ కోసం దిశా దీపావళీ పండగ రోజు బికినీతో దీపం పట్టుకొని ఫోటోలకు పోజులిచ్చింది. ఆ ఫోటో ఎంతటి రచ్చ రేపిందో అందరికీ తెల్సిందే. ఇక మొన్నటికి మొన్న కృతి.. రక్షా భందన్ యాడ్ లో క్లీవేజ్ షో చేసి వివాదాన్ని కొనితెచ్చుకుంది. ఇక ఈ లిస్ట్ లో చేరింది అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్. తాజాగా దీపావళి పండుగ సందర్భంగా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో పెద్ద దుమారమే రేపుతున్నాయి. మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన రాణి-పింక్ ప్యానెల్ లెహంగాలో ఆమె ట్రెడిషనల్ లుక్‌లో కనిపించినప్పటికీ.. క్లీవేజ్ షో చేయడంతో పెద్ద ఎత్తున వివాదం మొదలయ్యింది.

పండగ పూట వేసుకొనే బట్టలా ఇవి.. సిగ్గు లేదా..ముస్లిం పండుగ అయిన ఈద్ లేదా ఇతర ఇస్లామిక్ వేడుకల సమయంలో పూర్తిగా నిండుగా, సాంప్రదాయ పద్ధతిలో, ఎంతో గౌరవప్రదమైన దుస్తులలో కనిపించే ఈ నటీమణులు.. హిందూ పండుగలైన దీపావళి, రక్షాబంధన్, హోలీ లేదా నవరాత్రుల వచ్చేసరికి మాత్రం అత్యంత మోడ్రన్, గ్లామర్, ఎక్స్‌పోజింగ్ డ్రెస్సులు ఎందుకు వేసుకుంటారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నిలదీస్తున్నారు. ఇలా పండుగలను బట్టి దుస్తుల ఎంపికలో వివక్ష చూపడం హిందూ పండుగలను, హిందువులను అవమానించడమే అవుతుంది అంటూ నెటిజన్లు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.

కేవలం ఫ్యాషన్ లేదా ట్రెండ్ పేరుతో హిందూ సాంప్రదాయ పండుగలను సెలబ్రిటీలు కేవలం గ్లామర్ ప్రదర్శన కోసమే వాడుకుంటున్నారని, ఇతర మతాల పండుగలకు ఇచ్చే గౌరవం హిందూ పండుగలకు ఎందుకు ఇవ్వడం లేదని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు నిలదీస్తున్న పోస్టులు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మరోవైపు రకుల్ ప్రీత్ సింగ్ ఇటీవలే భారీ బడ్జెట్ పాన్-ఇండియా చిత్రం రామాయణలో శూర్పణఖ పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.

శర్వానంద్ 'భోగి'

మళ్లీ వాయిదా పడనుందా ..

ఇంకా క్లారిటీ ఇవ్వని మేకర్స్!



టాలీవుడ్ హీరో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రం 'భోగి' మరోసారి వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో, రా అండ్ రస్టిక్ లుక్‌లో శర్వానంద్‌ను సరికొత్తగా చూపిస్తూ దర్శకుడు సంపత్ నంది ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొన్నప్పటికీ, ప్రమోషన్ల విషయంలో మాత్రం చిత్రబృందం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. ఇటీవల సినిమా ట్రైలర్ విడుదలతో పాటు ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా వాయిదా పడటంతో విడుదల తేదీపై అనుమానాలు మొదలయ్యాయి. మరోవైపు సినిమా విడుదలకు కేవలం నాలుగు రోజులే సమయం ఉండటంతో ఈ మూవీ అనుకున్న తేదీకే థియేటర్లలోకి వస్తుందా? లేక మరోసారి వాయిదా పడుతుందా? అన్న చర్చ టాలీవుడ్‌లో జోరుగా సాగుతోంది.శర్వానంద్‌కు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన ప్రేక్షకులను సంపాదించుకున్నాడు. ఈ క్రమంలోనే 'భోగి' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యాడు. తెలంగాణ నేపథ్యంలోని ఓ గ్రామీణ కథను యాక్షన్ అంశాలతో మేళవించి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో శర్వానంద్ పాత్ర చాలా రా అండ్ రస్టిక్‌గా ఉండబోతుందని ప్రచారం జరుగుతోంది.



సూపర్ న్యాచురల్ హార్రర్ థ్రిల్లర్ 'డెమోంటే కాలనీ 3' ఆన్ ది వే

తెలుగులో రిలీజై మంచి టాక్ తెచ్చుకున్న తమిళ ఫ్రాంచైజీల్లో ఒకటి 'డెమోంటే కాలనీ ' ఆర్ అజయ్ జ్ఞానముత్తు రచన, దర్శకత్వంలో ఇప్పటికే డెమోంటే కాలనీ 2 కూడా వచ్చిందని తెలిసిందే. ఇప్పుడిక థర్డ్ పార్ట్ ట్రైం వచ్చేసింది. సూపర్ న్యాచురల్ హార్రర్ థ్రిల్లర్‌గా రాబోతున్న డెమోంటే కాలనీ 3విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్.ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. అరుల్ నిధి లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ మూవీ పలు వాయిదాల తర్వాత ఫైనల్‌గా 2027 పొంగళ్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది.

థర్డ్ పార్ట్‌లో అర్చనా రవిచంద్రన్ మీనాక్షి గోవింద రాజన్‌తోపాటు ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మూవీ ప్రమోషన్స్ త్వరలోనే షురూ కానున్నాయి.2015లో చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద గ్రాండ్ సక్సెస్ అందుకుంది డెమోంటే కాలనీ. మళ్లీ 8 ఏండ్ల తర్వాత వచ్చిన సీక్వెల్ పార్ట్‌లో అరుణ్‌పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవిందరాజన్, అర్చన రవిచంద్రన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.